వరంగల్ వార్త

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు

బుధవారం 30, సెప్టెంబర్ 2026 | 16 పేజీలు




## వనదేవతల సన్నిధిలో 'ది ప్యారడైజ్' టీమ్..

ఘనంగా మొక్కుల చెల్లింపు!

నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించిన నాని, శ్రీకాంత్ ఓదెల..

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ములుగు ప్రభాతవార్త

సినీ విజయం అనంతరం ప్రముఖ హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మేడారం వనదేవతల సన్నిధికి చేరుకున్నారు. ములుగు జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మేడారం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద 'ది ప్యారడైజ్' చిత్ర బృందం ప్రత్యేక పూజలు ..



16లో..



2 లో..

# తూర్పుపై పూర్తి ఫోకస్

కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగిస్తే చూస్తూ ఊరుకోం

ఇష్టానుసారంగా మాట్లాడుతే మహిళలే తగిన బుద్ధి చెబుతారు

త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నూతన కలెక్టరేట్ ప్రారంభం

అర్హులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ

వరంగల్ సిటీ సెప్టెంబర్ 29 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకునేలా చూస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ వరంగల్ ఓ సిటీ లోని క్యాంపు కార్యాలయంలో 61 లక్షల 61వేల రెండు వంద రూపాయల విలువ గల మొత్తం111 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ మాట్లాడుతూ పేద వర్గాల ప్రజలు అనారోగ్యం కారణంగా చికిత్సకు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందిస్తూ అండగా నిలుస్తుందని ఆమె తెలిపారు. రాష్ట్రంలోని నిరుపేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తూ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## ప్రమాద రహిత జిల్లాగా మహబూబాబాద్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యం



2లో..

-రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్ టౌన్,ప్రభాతవార్త:

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, ప్రయాణికుల భద్రతను మెరుగుపరచడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ..

## రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించాలి



16లో..

- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

జనగామ టౌన్, ప్రభాతవార్త :

జనగామ జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతంచేసి సంస్థను బలోపేతం చేసేందుకు నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. నూతనంగా ఎన్నికైన మేనేజింగ్ కమిటీ సభ్యులు సోమవారం రాత్రి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి



2లో..

250 గజాల ఇంటి స్థలం, రూ.25 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్

వరంగల్, ప్రభాతవార్త: తెలంగాణ సాధన కోసం ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జన ఐక్యత కమిటీ (గిగేరితిది) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్‌కు కమిటీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.తెలంగాణ ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను, భవిష్యత్తును పణంగా పెట్టిన ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రకటించిన హామీలను అమలు చేయాలని వినతిపత్రంలో కోరారు.

# తూర్పుపై పూర్తి ఫోకస్

మొదటి పేజీ తరువాయి..

అలాగే తూర్పు నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని తెలిపారు. డివిజన్ లోని సమస్యలపై డివిజన్ నాయకులతో చర్చించి పరిష్కరించేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇక నుంచి తూర్పు లో పూర్తి ఫోకస్ ఉంటుందని అన్నారు. కొందరు పని గట్టుకొని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతే చూస్తూ ఊరుకోమని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. నోరు జారీ ఇష్టానుసారంగా మాట్లాడుతే మహిళా కార్యకర్తలు కొడుతారని అన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పార్టీని గెలిపించాలని కోరారు. తూర్పు లో 24 కార్పొరేటర్ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పని చేయాలని ఆమె సూచించారు. అలాగే త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నూతన కలెక్టరేట్ ప్రారంభం అవుతుందని అన్నారు.చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గంలోని నాయకులు, మహిళా కార్యకర్తలు, కొండా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి

మొదటి పేజీ తరువాయి..

ముఖ్యంగా అర్హులైన ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ వేతనం అందించాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో ఎంతో మంది ఉద్యమకారులు తమ ప్రాణాలను, ఆరోగ్యాన్ని కోల్పోయారని కమిటీ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న అబ్బోజు రంజిత్‌కుమార్ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిని, బ్రెయిన్ అటాక్‌కు గురై ప్రస్తుతం పక్షవాతంతో బాధపడుతూ లేచి నడవలేని స్థితిలో ఉన్నారని వివరించారు. ఉద్యమకారుల త్యాగాలకు గుర్తింపుగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. తెలంగాణ కోసం జరిగిన ఉద్యమంలో ఒక్కరు, ఇద్దరు మాత్రమే కాకుండా వేలాది మంది ఉద్యమకారులు తమ వ్యక్తిగత జీవితాలను, భవిష్యత్తును పణంగా పెట్టి పోరాడారని తెలిపారు. వారి త్యాగాలను ప్రభుత్వం గుర్తించి, హామీలను కార్యరూపంలోకి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించకపోతే, తమ హక్కుల సాధన కోసం మళ్లీ ధర్నాలు, ఆందోళనలు చేపడుతామని తెలంగాణ జేఏసీ సహాయ కార్యదర్శి ప్రవళిక స్పష్టం చేశారు. ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఆమె పేర్కొన్నారు.

# ప్రమాద రహిత జిల్లాగా మహబూబాబాద్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి..

ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారులు అందరూ బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాను రోడ్డు ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలన్నారు.జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి తక్షణమే రోడ్డు ఇంజనీరింగ్ లోపాలను సరిచేయాలని,డేంజర్ జోన్స్, మలుపుల వద్ద స్పష్టమైన హెచ్చరిక బోర్డులు,స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలన్నారు.హెల్మెట్,సీట్ బెల్ట్ ధరించకపోవడం,అతి వేగం,డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై కఠిన తనిఖీలు చేపట్టాలన్నారు.మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తప్పవని,పరిమితికి మించి లోడ్‌తో వెళ్లే వాహనాలపై భారీ జరిమానాలు విధించాలని,వర్షాల వల్ల రోడ్లపై ఏర్పడిన గోతులను తక్షణమే పూడ్చివేయాలని,రాత్రి వేళల్లో రహదారులపై తగినంత వెలుతురు ఉండేలా వీధి దీపాల నిర్వహణను మెరుగుపరచాలని,ప్రధాన రహదారుల పక్కన అక్రమంగా పార్క్ చేసే వాహనాలపై ఆర్‌టీఓ,ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలలు,బస్టాండ్లలో విద్యార్థులకు,ప్రజలకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని,ఆటో,క్యాబ్,లారీ డ్రైవర్లకు సురక్షిత ప్రయాణ నియమాలపై కౌన్సెలింగ్ ఇవ్వాలని,ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేలా 108 అంబులెన్స్ సేవలను అనుసంధానించాలని,రహదారులకు సమీపంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఎల్లప్పుడూ అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచాలని వైద్యారోగ్య శాఖను ఆదేశించారు.జిల్లాలో మరిపెడ, తొర్రూరు, గూడూర్, మండలంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని మరిపెడ జాతీయ రహదారి నెంబర్ 365,563 పై సమస్యలు గుర్తించామని కేవలం మరిపెడ లో (13) మంది చనిపోయారని,అలాగే కాంపెల్లి, కందికొండ, ఉప్పరి గూడెం, నల్లెల, తొర్రూరు పాలకేంద్రం జంక్షన్, టౌన్, గూడూరు మండల కేంద్రం, భూపతిపేట, దామరవంచ, బొద్దుగొండ, వద్ద హై టెంక్షన్ వైర్ల, సమస్యలు, మహబూబాబాద్ టౌన్, బెతోల్, తల్లపుసపల్లి, కురవి ఏకవలవ్య స్కూల్,బయ్యారం జాతీయ రహదారి 930 పి పై సాయిబాబా, టెంపుల్, సత్యనారాయణపురం,కొత్తపేట,గంధంపల్లిలో సమస్యల పరిష్కారం కోసం వెంటనే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా జాగ్రత్తగా ప్రయాణం చేసే విధంగా అవగాహన కల్పించే బాధ్యత సంబంధిత అధికారులు తీసుకోవాలని కోరారు.రహదారుల పక్కన, జాతీయ రహదారులపై అక్రమంగా వాహనాలను నిలిపివేస్తే ట్రాఫిక్ పోలీసులు వెంటనే క్రేన్ల సహాయంతో తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని, పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్,ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పీడీ పురుషోత్తం, అధికారులు రాజు,డీఎస్పీ తిరుపతి రావు,నాగలక్ష్మి,నితీష్,డాక్టర్ కిరణ్ కుమార్,డాక్టర్ రవి రాథోడ్,డాక్టర్ శ్రీనివాస్,డాక్టర్ రమేష్,మదర్,ఎక్సైజ్, పోలీస్, అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ రేవంత్,సంబంధిత అన్ని విభాగాల అధికారులు,కలెక్టరేట్ పర్యవేక్షకులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు ఎంతో కీలకం

క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలి... జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి..





ప్రభాతవార్త సుబేదారి:

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు ఎంతో కీలకంగా నిలుస్తాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. జిల్లా పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో 70వ హనుమకొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (టీజిఎఫ్) అంతర్ పాఠశాల క్రీడా పోటీలను జవహర్ లాల్ నెహ్రూ మైదానంలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ పాఠశాలల క్రీడా పోటీల ముగింపు కార్యక్రమము మంగళవారం హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కబడ్డీ, ఖోఖో,వాలీబాల్ క్రీడల్లో అండర్14, అండర్17 బాలురు, బాలికల విభాగాల్లో పోటీలలో విన్నర్, రన్నర్లకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుగ్గా పాల్గొనాలని, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, జట్టుగా పనిచేసే తత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. హనుమకొండ జిల్లాలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో అండర్14, అండర్17 బాలబాలికల విభాగాల నిర్వహించిన పోటీల్లో విద్యార్థి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయని, పాఠశాల స్థాయి నుంచే క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు తగిన శిక్షణ, అవసరమైన సౌకర్యాలు కల్పించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కలెక్టర్ సూచించారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీలను విజయవంతంగా నిర్వహించిన విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, పాల్గొన్న క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎల్. వి. గిరిరాజ్ గౌడ్, జిల్లా యువజన, క్రీడల అధికారి కొత్త ప్రశాంత్, ఎస్ జి ఎఫ్. అండర్ 14 అండ్ 17 కార్యదర్శి వి వాసుదేవరావు, పేటా టిఎస్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి , టిజిపేట అధ్యక్షులు పార్థసారథి వివిధ మండల కార్యదర్శులు క్రీడా సంఘాల ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# హన్మకొండ బస్ స్టేషన్‌లో మొబైల్ ఫోన్ దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

సెల్‌ఫోన్ స్వాధీనం

హనుమకొండ సిఐ మచ్చ శివకుమార్

**సెప్టెంబర్ 29, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :**

హనుమకొండ బస్ స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని మొబైల్ ఫోన్ దొంగతనానికి పాల్పడుతున్న ఒక యువకుడిని హనుమకొండ పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి దొంగిలించబడిన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, మాదిగ అరవింద్, తండ్రి సుంకయ్య, వయస్సు 18 సంవత్సరాలు, నివాసం కీసర, మేడ్చల్ జిల్లా, గతంలో కూడా రద్దీగా ఉండే బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల వద్ద మొబైల్ ఫోన్లు, నగదు దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది. దొంగిలించిన మొబైల్ ఫోన్లను తక్కువ ధరకు విక్రయించి వచ్చిన డబ్బును వ్యక్తిగత ఖర్చులకు వినియోగించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిపారు.




ఇదే క్రమంలో 28092026 తెల్లవారుజామున హైదరాబాద్ నుండి బస్సులో బయలుదేరి సుమారు ఉదయం 07:30 గంటలకు హనుమకొండ బస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. బస్ ఎక్కుతున్న ప్రయాణికులను గమనిస్తూ ఉండగా, సుమారు ఉదయం 08:00 గంటల సమయంలో ఒక ప్రయాణికుడి ప్యాంట్ జేబులో ఉన్న మొబైల్ ఫోన్‌ను అతనికి తెలియకుండా దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది. మరుసటి రోజు 29092026 న తిరిగి హనుమకొండ బస్ స్టేషన్‌కు వచ్చి ప్రయాణికుల వద్ద మొబైల్ ఫోన్లు లేదా నగదు దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు అతని కదలికలను గమనించారు. పోలీసులను చూసి అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితునిపై గతంలో ఉప్పల్, నల్గొండ 2 టౌన్, చేవెళ్ల, ఆర్ పి ఎస్ వరంగల్, సికింద్రాబాద్ లలో ఆరు కేసులు ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా

**ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి:**

బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రయాణించే సమయంలో ప్రజలు తమ మొబైల్ ఫోన్లు, నగదు మరియు ఇతర విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి అని హనుమకొండ పోలీసులు తెలియజేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపించినట్లయితే వెంటనే సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కిశోర్ తో పాటు స్టేషన్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సమస్యలపై అసిస్టెంట్ కలెక్టర్ కి వినతి ..

తెలంగాణ ఉద్యమకారుల జన ఐక్యతా కమిటీ....

ప్రభాతవార్త సుబేదారి:

వరంగల్ జిల్లాలో మంగళవారం నాడు తెలంగాణ ఉద్యమకారుల జన ఐక్యత కమిటీ అసిస్టెంట్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఎవరెవరైతే తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు ఉన్నారో, వారందరికీ ఇస్తామని చెప్పిన గ్యారంటీలలో ఒకటైన ..250 గజాల ఇంటి స్థలం, రూ.25,000 గౌరవ వేతనం.. ఇవ్వాలని కోరడం జరిగింది. అదే క్రమంలో ఎంతో మంది ఉద్యమకారులు తమ ప్రాణాలను మరియు ఆరోగ్యాన్ని నష్టపోయిన విషయాన్ని కూడా కలెక్టర్ కు ఎదుట గుర్తు చేసుకోవడం జరిగింది. దాంట్లో ముఖ్యంగా అబ్బోజు రంజిత్ కుమార్ ఉద్యమకారుడు ఉద్యమంలో భాగంగా తన ఆరోగ్యాన్ని పూర్తిగా నష్టపోయి, బ్రెయిన్ అటాక్‌కు గురై, ఇప్పటికీ కూడా పక్షవాతంతో కోలుకోలేని మరియు లేచి నడవలేని పరిస్థితిలో ఉన్నారని కలెక్టర్ తెలియజేసి బాధను వ్యక్తం చేయడం జరిగింది. ఇలా ఒక్కరు, ఇద్దరు మాత్రమే కాదు, ఎంతో మంది ఉద్యమకారులు తమ భవిష్యత్తును పణంగా పెట్టి తెలంగాణ



సాధనలో ముందుండి తెలంగాణను సాధించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని, వారు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోతే, మళ్లీ ధర్నాలు, ఉద్యమాలు చేయడానికి వెనుకడుగు వేసేది లేదని తెలంగాణ జేఏసీ తరపున జేఏసీ సహాయ కార్యదర్శి ప్రవళిక పేర్కొనడం జరిగింది.

## కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలి

### - ఎల్తూరి సాయికుమార్ స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు

సెప్టెంబర్ 29, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్:



కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్ ను నియమించాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ అన్నారు. ఈ సందర్భంగా కేడీసీ కాలేజ్ ముందు రెగ్యులర్ ప్రిన్సిపాల్ ను నియమించాలని నిరసన తెలియజేయడం జరిగింది. సుమారు గత రెండు సంవత్సరాల నుండి ఇంచార్జ్ ప్రిన్సిపాల్ గా ఉంటూ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారంటే ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపాల్ గుర్రం శ్రీనివాస్ తరగతి గదులను తొలగించి సెమినార్ హాల్ చేయడంతో సుమారు 500 మంది విద్యార్థులకు నష్టం జరుగుతుంది అదేవిధంగా మరుగుదొడ్లల్లో నీళ్ల సదుపాయం లేకపోవడంతో బాలికలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు విద్యార్థులు మరియు విద్యార్థి సంఘం నాయకులు ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపాల్ కు విన్నవించుకున్న స్పందించడం లేదు. కళాశాలలో మంచినీటి సదుపాయం లేనందున విద్యార్థులు ప్రశ్నిస్తే వారిని టార్గెట్ చేస్తూ పరీక్షల్లో ఫెయిల్ చేయడం జరుగుతుంది. కాబట్టి విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్న చూస్తూ ఉంటు గత రెండు సంవత్సరాల నుండి ఇన్చార్జి ప్రిన్సిపాల్ కళాశాలకు అభివృద్ధి చేసిందానికంటే నష్టం చేయడమే ఎక్కువైందని హెద్దేవా చేశారు కాబట్టి తక్షణమే ప్రస్తుతం ఉన్న ఇన్చార్జి ప్రిన్సిపాల్ ను తొలగించి రెగ్యులర్ ప్రిన్సిపాల్ ను నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం లేనియెడల స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ చెట్టు పల్లి శివకుమార్, కాకతీయ ప్రభుత్వ కళాశాల అధ్యక్ష కార్యదర్శులు రాజ్ కుమార్, వంశీ, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు కార్తీక్, నాగరాజు, బంటి, శ్రీనాథ్, సిద్ధూ, వంశీ, శ్రావణ్ ,గణేష్, ముకేష్, కార్తీక్, లక్ష్మణ్, రాజ్ కుమార్, విగ్నేష్, అభి, పవన్ కుమార్, బన్నీ, వినయ్, గణేష్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సబ్‌ప్లాన్‌పై రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డికి వినతి

రాయపర్తి ప్రభాతవార్త సెప్టెంబర్ 29:

రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు గబ్బెట బాబు రాయపర్తి ఎస్సీ సబ్‌ప్లాన్‌కు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు గబ్బెట బాబు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్ స్వగృహంలో



మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గాల అభివృద్ధి, నిధుల వినియోగం, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరింత ప్రయోజనకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు గబ్బెట బాబు పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నిధుల కేటాయింపు, అమలు తీరుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని శాలువాతో సత్కరించి, పలు అంశాలపై వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఎస్సీ వర్గాల సమస్యలను ప్రభుత్వ స్థాయిలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని గబ్బెట బాబు కోరారు.

## మానవ అక్రమ రవాణా అరికట్టాలి

### - రెవెన్యూ డివిజన్ అధికారి డి.ఎస్.వెంకన్న

పరకాల సెప్టెంబర్ 29 (ప్రభాతవార్త):




మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి డి.ఎస్. వెంకన్న అన్నారు. మంగళవారం పరకాలలోని ఆర్డీఓ కార్యాలయంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, హనుమకొండ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, కార్మిక శాఖల అధికారులకు మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి నిర్మూలన అంశాలపై సమీక్ష మరియు సామర్థ్య నిర్మాణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ డి.ఎస్. వెంకన్న అధ్యక్షత వహించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలోని బలహీన వర్గాలకు చెందిన వ్యక్తులను ప్రలోభాలకు గురిచేసి, ఆశలు చూపి కొందరు సంఘటితంగా మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల ఆర్థిక, సామాజిక బలహీనతలను ఆసరాగా చేసుకొని వారిని వెట్టిచాకిరీలోకి నెడుతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి బాధితులను గుర్తించి, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరకాల డివిజన్‌లోని ప్రతి మండలంలో మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, వెట్టిచాకిరి నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రానున్న రోజుల్లో డివిజన్ స్థాయిలో విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ ద్వారా ఈ నేరాల నియంత్రణకు సమగ్ర చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజేఎం), హైదరాబాద్ నుంచి డాక్టర్ ఆనంద్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి నిర్మూలనకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు ఎర్ర శ్రీకాంత్, ఇక్బాల్ పాషాతో పాటు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్లు, కార్మిక శాఖ అధికారి వినోద్ కుమార్, వరంగల్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఎఫ్ఎంఎం సిబ్బంది నరసింహ స్వామి, రాకేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

## గుండెను కాపాడుకుంటేనే జీవితం పదిలం

### - ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండె భద్రత

సెప్టెంబర్ 29, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్:



ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రముఖ సామాజికవేత్త, మిల్లెట్స్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ సూచించారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాలతో గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు ఎంతో అవసరమని అన్నారు. రోజుకు కనీసం 30 నిమిషాల పాటు నడక, యోగా లేదా తగిన వ్యాయామం చేయడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు పదార్థాలను తగ్గించి, కూరగాయలు, పండ్లు, పౌష్టికాహారం, తెల్ల బియ్యం తగ్గించి చిరుధాన్యాలైన మిల్లెట్స్ ను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ధూమపానం, అధిక మద్యపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. అలాగే రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి అంశాలను క్రమం తప్పకుండా పరీక్షించుకోవడంతో పాటు, ఛాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అసాధారణమైన అలసట వంటి లక్షణాలను నిరక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని నిమ్మల శ్రీనివాస్ సూచించారు.

## నేరాలు-దారుణాలు

## కన్నూరులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### - ఆరుగురు అరెస్ట్

**కమలాపూర్ ప్రభాతవార్త:** కమలాపూర్ మండలం కన్నూరు గ్రామంలో అక్రమంగా పేకాట ఆడుతున్న స్థావరంపై మంగళవారం కమలాపూర్ పోలీసులు దాడి నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకు ఎస్ఐ అనంతగిరి మధు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఈ దాడి చేపట్టారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 9,000 నగదు, 52 పేక ముక్కలు, 3 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ నవీన్ మాట్లాడుతూ.. మండలంలో పేకాట, ఇతర అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎక్కడైనా అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు

### - నేరాలు నియంత్రణ కొరకై కాటన్ సెర్చ్

### - ప్రభుత్వం నిషేధించిన వస్తువులను విక్రయిస్తే కేసులు నమోదు: సీఐ గణేష్

నరసింహుల పేట సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:



మండలంలోని మంగళవారం గోపతండ, చింతల తండ, అమీర్య తండ, కొత్త తండ గుడుంబా స్థావురాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తొర్రూర్ సిఐ గణేష్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ అవుట్ రిచ్ కార్యక్రమం నిర్వహించి అనంతరం గుడుంబా స్థావరాలు లక్ష్యంగా దాడులు నిర్వహించి 2000 బెల్లం పానుక ధ్వంసం చేసి మూడు క్వింటాళ్ల నల్ల బెల్లం 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని మొత్తం 15 మంది వ్యక్తుల వద్ద నుంచి వీటిని స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన మేరకు ప్రభుత్వం నిషేధించిన ఎలాంటి వస్తువులను విక్రయించిన కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో నరసింహులపేట ఎస్సై భానోత్ వెంకన్న, తొర్రూర్ ఎస్సై ఖాదర్ పాషా, దంతాలపల్లి ఎస్సై రవి, పెద్ద వంగర ఎస్సై ప్రమోద్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## ఆదివాసీ కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుడి చేయూత..

**- మృతుడి కుటుంబానికి నిత్యావసర సరుకులు బియ్యం అందజేత..**

మహాదేవపూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:

మహాదేవపూర్ మండలం అన్నారం, కొమురంభీం కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గావిడి వెంకటయ్య కుటుంబానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వేమునూరి తిరుపతిరెడ్డి (గోపన్న) అండగా నిలిచారు. ఆదివారం నిర్వహించిన దశ దిన పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, అనంతరం వంట సరుకులు, బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య కుమారులు సమ్మయ్య,



కొమ్మయ్య, దుర్గరాజులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తండ్రి పేరును నిలబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు మడే కుమార్, ఆదివాసీ నాయకులు నగునూరి స్వామిగౌడ్, కుల పెద్దలు చీడం పోచయ్య, యువ నాయకులు కొడుపె నాగరాజు, చీడం శ్రీనివాస్, కోరితే రవితేజ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.




## కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఐజీ అంబర్ కిషోర్ ఝా

**- ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి...**

**- రికార్డులు, శాంతిభద్రతలపై సమీక్ష..**

మహాదేవపూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:



కాళేశ్వరం జోన్। డీఐజీ అంబర్ కిషోర్ ఝా మంగళవారం కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరును సమీక్షించారు. అనంతరం సీసీటీఎన్ఎస్ పరిధిలో ఆన్‌లైన్ వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియపై ఎస్ఐ, స్టేషన్ రైటర్లతో మాట్లాడి ఆరా తీశారు. స్థానిక నేరాలు, గ్రామాల పరిస్థితి, శాంతిభద్రతల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా వ్యవహరించాలని, బాధితులకు మెరుగైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ, వారి కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇది రాష్ట్ర సరిహద్దు ప్రాంత పోలీస్ స్టేషన్ కావడంతో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ, ప్రజల భద్రతకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. వారి వెంట స్థానిక పోలీస్ అధికారులు ఉన్నారు.

## బీజేపీలో చేరిన బీసుల నిర్మల..

**మహాదేవపూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** మహాదేవపూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్ ఆధ్వర్యంలో కిష్టారావుపేటకు చెందిన బీసుల నిర్మల బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చల్లా నారాయణరెడ్డి సమక్షంలో ఆమెకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ సిద్ధాంతాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై నిర్మల పార్టీలో చేరినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు మనోజ్ పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మహాదేవపూర్ మండలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని



పేర్కొన్నారు.కార్యక్రమంలో సాయి, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## డిటిఎఫ్ ఆధ్వర్యంలో గురుకుల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వీధిలైట్ల పంపిణీ...

**- రాత్రి సమయాల్లో భద్రత కల్పించడమే లక్ష్యం...**

**- నాయకులు, ప్రజాప్రతినిధుల ప్రశంసలు...**

కాటారం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్ పాఠశాల ఆవరణలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) కాటారం మండల శాఖ ఆధ్వర్యంలో 8 వీధిలైట్లను అందజేశారు. విద్యా సముదాయ పరిధిలోని ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్, ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్, కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో దాదాపు 2,500 నుండి 3,000 మంది విద్యార్థులు చదువుతుండగా, 60 నుండి 70 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాలల సమీప రహదారిపై రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు రాత్రి సమయాల్లో వీధి కుక్కలు, పాములు, తేళ్ల భయంతో తీవ్ర తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యను గుర్తించిన డిటిఎఫ్ మండల శాఖ, జిల్లా శాఖ సహకారంతో ఒక దాత ఉచితంగా అందించిన 8 వీధిలైట్లను పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు సామాజిక సేవలో డిటిఎఫ్ ముందుండటం అభినందనీయమని కొనియాడారు. డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.



తిరుపతి మాట్లాడుతూ.. గత విద్యాసంవత్సరం సభ్యత్వ నమోదు సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పడుతున్న ఈ సమస్య తమ దృష్టికి వచ్చిందని, సామాజిక బాధ్యతగా దీనిని పరిష్కరించామని తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. డిటిఎఫ్ మండల అధ్యక్షుడు రాజు నాయక్, ప్రధాన కార్యదర్శి మోహన్ ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంతకాని సడవలి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య, మహాదేవపూర్ సింగిల్ విండో చైర్మన్ చల్ల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు లక్ష్మణ్ నాయక్, ప్రభాకర్ రెడ్డి, పూర్వ జిల్లా అధ్యక్షుడు జె. కరుణాకర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు బి. తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు హరిస్తున్న ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి..

**- సీపీఐ(ఎంఎల్) లిబరేషన్‌జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కాటారంలో నిరసన..**

**- పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా**

కాటారం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :

ఎన్నికల సంఘం స్వతంత్రతను, ప్రజాస్వామ్య విశ్వసనీయతను కాపాడేందుకు సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గారేపల్లి అంబేద్కర్ సెంటర్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ రాజా మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాథమికమైనదని, పారదర్శకమైన ప్రక్రియ లేకుండా ఓటర్ల పేర్లను తొలగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని మండిపడ్డారు. ప్రస్తుతం జ్ఞానేష్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అనేక లోపాలున్నాయని, దీన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పునరుద్ధరించాలన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని, తటస్థత, జవాబుదారీతనం పెంచేలా చర్యలు ఉండాలని కోరారు. సీఈసీని అభిశంసించాలని, ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత జరిగిన ఎన్నికలపై సమీక్ష జరిపి అవసరమైన చోట మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని తమ పార్టీ ఇప్పటికే రాష్ట్రపతికి విన్నవించినట్లు తెలిపారు. ఎన్నికల వ్యవస్థను, ఓటు హక్కును కాపాడుకునేందుకు ప్రజలంతా దేశవ్యాప్త పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్, జిల్లా నాయకులు బందు క్రాంతి, ఆత్కూరి శ్రీకాంత్, డానియల్, అశ్వత్థామ, రాజు, సుజాత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యకర ఎదుగుదల..

– అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం..

**మహాదేవపూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** మహాదేవపూర్ మండలం బీరసాగర్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ రాధికారెడ్డి, సూపర్‌వైజర్ స్పందన ఆదేశాల మేరకు అంగన్వాడీ టీచర్ రజిత ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రకాల పోషకాహార పదార్థాలతో ప్రదర్శన ఏర్పాటు చేసి, ఆయా ఆహార పదార్థాల్లో లభించే పోషక విలువలను వివరించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య పోషకాహారం అందించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు చిన్నారుల ఆరోగ్యకర ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు చిన్నారుల ఆహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు యూనిఫామ్, షూస్‌ల పంపిణీ

గణపురం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త: గొల్లపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఏకరూప దుస్తులు, షూస్, సాక్సులు, బెల్టులను మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లబోయిన విజయభాస్కర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి గొల్లపల్లి గ్రామ సర్పంచ్ ఉడిగె అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినీ, విద్యార్థులకు యూనిఫామ్, షూస్, సాక్సులు, బెల్టులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షి ంచారు. త్వరలోనే తన సొంత ఖర్చుతో విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌతమి, ఉపాధ్యాయులు శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి హిందూ వ్యతిరేక వ్యాఖ్యలపై నిరసన

- హనుమకొండ చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం

- తక్షణమే హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

- బీజేపీ నాయకులు రావు పద్మ రెడ్డి, పగడాల కాళీప్రసాద్ రావు డిమాండ్

సెప్టెంబర్ 29, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్:



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం బీజేపీ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన బీజేపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కాంటెస్టెడ్ కాండిడేట్ రావు పద్మ రెడ్డి మరియు పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాంటెస్టెడ్ కాండిడేట్ పగడాల కాళీప్రసాద్ రావు లు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సనాతన ధర్మంలో రాముడు, శివుడు వేరు కాదని, స్వయంగా శ్రీరాముడే ఆ మహాదేవుడిని ఆరాధించాడని గుర్తుచేశారు. "దేవుళ్లను, కులాలను, ప్రాంతాలను వేరు చేస్తూ కాంగ్రెస్ పార్టీ సమాజంలో విద్వేష విషాన్ని చిమ్ముతోంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక రాజకీయ లబ్ధి కోసమే రేవంత్ రెడ్డి ఈ తరహా హిందూ వ్యతిరేక కుట్రలకు పాల్పడుతున్నారు" అని మండిపడ్డారు. దక్షి ణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం, దక్షి ణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం రామాలయం ఉన్న తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటూ, శ్రీరాముడికి, పరమశివుడికి మధ్య ఉత్తరదక్షిణ సరిహద్దులు గీయడం రేవంత్ రెడ్డి అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లోని మన్యంకొండ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయమే హరిహర క్షేత్రానికి ప్రతీక అని, అటువంటి నేల నుండి వచ్చిన సీఎం దేవుళ్ల మధ్య విభజన తేవడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల వేళ దేవుళ్ల పేరిట ప్రమాణాలు చేసి ఓట్లు అడిగిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అదే దేవుళ్లకు కులం, ప్రాంతం అంటగట్టడం దారుణమని ధ్వజమెత్తారు. హిందూ సమాజ భావోద్వేగాలను దెబ్బతీసిన సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పి.జయంత్ లాల్, జిల్లా నాయకులు ఆకుల శ్రీకాంత్ పటేల్, బైరి శ్రావణ్, బొమ్మసాని అనిల్, జరీనా, ధనలక్షి మ్మ, కొండెం రవీంద్ర రెడ్డి, భారత్ గౌడ్, శ్రీరాంరెడ్డి, పున్నం వేణు, మాజీ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక పై ఒక్కరోజు శిక్ష

**రాయపర్తి ప్రభాతవార్త సెప్టెంబర్ 29 :** రాయపర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక తయారు చేయు విధానం పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇవ్వటం జరిగింది ఎల్ నీ నో ద్వారా వచ్చే పరిణామాలను ఎదుర్కొనుటకు వి బి జి రాంజీ లో జలసిరి ప్రోగ్రామ్స్ , ఇంటింటికీ ఇంకుడు గుంతలు పొలానికి పంటకుండా ఊరికి ఊట కుంట ఎండిపోయిన బోర్లకు బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్స్ మరియు సామూహిక ఇంకుడు గుంతలకు అదేవిధంగా గ్రామంలోని అన్ని రకాల మౌలిక సదుపాయాలు గ్రామపంచాయతీ భవనం, వివో భవనం గ్రంథాలయం, కమ్యూనిటీ హాల్ ప్రభుత్వ స్కూళ్లకు అదనపు గదులు కిచెన్ షెడ్లు కాంపౌండ్ వాల్సు మరియు రిపేర్లు లాంటి అన్ని మౌలిక వసతులు ఏర్పాటుకు ఒక రోజు ఓరియంటేషన్ ఇవ్వడం ద్వారా విజిపిపి ప్లాన్లో వివరించడం జరిగింది ఇట్టి సమావేశంలో సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవో ఆర్డబ్ల్యూఎస్ ఎంపీవో, ఏపీవో లు పాల్గొన్నారు.



## అభయ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రభాతవార్త సుబేదారి;



ఇటీవల కాలంలో గ్రామంలో విస్తరిస్తున్న వైరల్ జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడుతున్న ప్రజల సౌకర్యార్థం అమ్మాపురంలో వైద్యం కృష్ణమూర్తి స్మారకార్థం ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యం రాజగోపాల్ తెలిపారు. హాస్పిటళ్లకు వెళ్లలేని వృద్ధులు, వితంతువులు, పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా తన తండ్రి వైద్యం కృష్ణమూర్తి స్మారకార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం అమ్మాపురంలో హనుమకొండ కాకాజీ కాలనీలోని ర్యాపిడ్ డయాగ్నోస్టిక్స్ ఖి, ఖిఅభయ హాస్పిటల్ ఖి సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ క్యాంపులో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ వైద్యం గౌతమ్, జనరల్ సర్జన్ డాక్టర్ వైష్ణవి మస్నా, గైనకాలజిస్ట్ డాక్టర్ డొంక భార్గవిల బృందం ఉచిత వైద్య సేవలు అందించింది. సుమారు 200 మంది గ్రామస్తులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రూ. 40,000 విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరం నిర్వహణకు సహకరించిన గ్రామ సర్పంచ్ బొలగాని రేఖ బాపిరాజు, ఉపసర్పంచ్ ఇర్రి కృష్ణారెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు బోగ అంజయ్య, కక్కెర్ల వెంకటేశ్వర్లు, బొలగాని బిక్షపతి, మోహన్ రెడ్డిలతో పాటు పోతారం, పిట్టలగూడెం గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు, పంచాయతీ సిబ్బందికి వైద్యం రాజగోపాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణలో జనసేన ప్రత్యామ్నాయం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాస్

ప్రభాతవార్త సుబేదారి :



తెలంగాణలో జనసేనపార్టీ ప్రత్యాన్మయంగా మారబోతుందని జనసేనపార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ హెల్త్ డైరెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాస్ అన్నారు. హన్మకొండలో హరిత కాకతీయ హోటల్ హాల్ లో ఏర్పాటు చేసిన జనసేనపార్టీ ముఖ్య నాయకులతో పట్టభద్రుల ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరై మాట్లాడుతూ సామాజిక న్యాయమే జనసేన లక్ష్యమని తెలిపారు. పట్టభద్రులు, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగ నియామకాలు, యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాలను శాసనమండలి వేదికగా బలంగా ప్రస్తావిస్తామని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, హక్కులు అందేలా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలను రెండు ప్రభుత్వాలు మోసం చేశాయన్నారు. పట్టభద్రుల పట్ల అధికార ప్రతిపక్ష పార్టీలకు చిత్తశుద్ధి లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన గెలిచి సామాజిక న్యాయం దిశగా ముందుకు వెళ్తామన్నారు. జనసేన తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్ మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. మచ్చ సుధాకర్, శ్రీధర శర్మ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ మాదిరెడ్డి దామోదర్ రెడ్డి, జిల్లా నేతలు గాదె పృథ్వీ గోళ్ల రాజేంద్రప్రసాద్, గడ్డం రాకేష్, డా. పద్మజదేవి, కరాటే ప్రభాకర్, మెరుగు శివకోటి, అమంచ సునీల్, నామాల సిద్దులు, రాజ్ కుమార్, ప్రశాంత్ రెడ్డి, బర్ల శివ, ముస్కు రమేష్, ప్రశాంత్, సనత్, ప్రసన్న కుమార్, చక్రపాణి, రవిష్, నగేష్ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్లు, నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడోత్సవాలు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, డీఈవో గిరిరాజ్ గౌడ్

**ప్రభాతవార్త సుబేదారి:** హనుమకొండ జేఎన్ఎస్ గ్రౌండ్స్ నందు స్కూల్



గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా స్థాయి క్రీడోత్సవాలను ఘనంగా నిర్వహించారు ఈ క్రీడలకు ముఖ్యఅతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల ద్వారా పోటీతత్వం శారీరక మానసిక దృఢత్వాన్ని కలిగి ఉంటుందని స్నేహభావము నాయకత్వ లక్షణాలు అలవర్చుకొని క్రీడలతోపాటు చదువులో కూడా ముందడుగు వేసినప్పుడే పై స్థాయికి చేరుకొని ఉన్నత స్థితిలో కొనసాగుతామన్నారు ఈ క్రీడోత్సవాలు మండల స్థాయిలోని క్రీడాకారులు జిల్లా జట్టులో స్థానం సంపాదించడానికి తమ ప్రతిభను కనబరచడానికి ఈ క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు అనుమకొండ జిల్లాకు సంబంధించి 14 మండలాల నుండి మూడు క్రీడాంశాలలో కబడ్డీ ,ఖోఖో, వాలీబాల్ పోటీలలో అండర్ 14, 17 బాల బాలికల విభాగాలలో ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు అనుమకొండ జిల్లా నుండి మొత్తం 2000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా డివైస్ఓ కొత్త ప్రశాంత్ , డిస్టిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ గిర్రాజ్ గౌడ్, గ్రంధాలయం చైర్మన్ అజీజ్ ఖాన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డిస్టిక్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి సెక్రటరీ కుమార్ స్వామి , స్కూల్ గేమ్ ఫెడరేషన్ స్టేట్ సెక్రెటరీ వాసు తో పాటు వివిధ మండలాల నుండి పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



## రోహిణి హాస్పిటల్ లో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా గుండె జబ్బు లపై అవగాహన సదస్సు

**ప్రభాతవార్త సుబేదారి:** హనుమకొండ సుబేదారిలోని రోహిణి హాస్పిటల్ లో ఘనంగా ప్రపంచ గుండె దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోహిణి హాస్పిటల్ చైర్మన్ బుచ్చిరెడ్డి, సూపరిండెంట్ సుధాకర్ రెడ్డి కార్డు వైద్యులు వెన్ని పాల్గొన్నారు. రోహిణి హాస్పిటల్ కాలేజ్ విద్యార్థులు గుండె భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి సంబంధించిన నాటక ప్రదర్శన అద్భుతంగా ఆకట్టుకుంది ప్రజలు గుండెను నిరక్ష ్యం చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆహారప అలవాట్ల గురించి ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో చైర్మన్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ హృదయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రోజు సరైన ఆహారపు అలవాట్లు ప్రశాంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని తెలియజేశారు అంతేకాకుండా కార్డుయాకారెస్ట్ జరిగినప్పుడు సిపిఆర్ చేసే విధానాన్ని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు ఈ కార్యక్రమంలో రోహిణి హాస్పిటల్ వైద్యులు సిబ్బందితోపాటు తదితరులు పాల్గొన్నారు.



# జెడ్‌పీ హైస్కూల్‌లో ఘనంగా పిల్లల పార్లమెంట్ ప్రదర్శన

## పార్లమెంటరీ విధానాలపై విద్యార్థులకు అవగాహన – నాయకత్వ లక్షణాల పెంపునకు కార్యక్రమం






వెంకటాపురం అర్బన్ ప్రభాతవార్త:
ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని జెడ్‌పీ హైస్కూల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మాక్ పిల్లల పార్లమెంట్ ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు మాక్ పార్లమెంటు సమావేశాల నిర్వహణ, సభా విధానాలు, మంత్రుల బాధ్యతలు, ప్రశ్నోత్తరాల సమయం తదితర అంశాలను పాత్రధారణ ద్వారా చక్కగా ప్రదర్శించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం జి వి సత్యనారాయణ నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాక్ పిల్లలు పార్లమెంట్ కార్యక్రమాన్ని ఎంతో చక్కగా ప్రదర్శించారని, వారి ప్రతిభ అభినందనీయమని అన్నారు. చిన్న వయస్సు లోనే విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, పార్లమెంటరీ విధానాలు, నాయకత్వ బాధ్యతలపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

### విద్యార్థుల ప్రతిభకు అభినందనలు

పిల్లల మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు స్పీకర్, ప్రధానమంత్రి, వివిధ శాఖల మంత్రులు, ప్రతిపక్ష సభ్యులు తదితర పాత్రలను పోషించారు. సభ ప్రారంభం నుంచి ప్రశ్నోత్తరాల సమయం, ప్రజా సమస్యల ప్రస్తావన, మంత్రుల సమాధానాలు, ప్రతిపక్ష సభ్యుల సూచనలు వంటి అంశాలను విద్యార్థులు తమదైన శైలిలో ప్రదర్శించారు. పార్లమెంటులో సభ్యులు ప్రజా సమస్యలను ఎలా ప్రస్తావిస్తారు, ప్రభుత్వం తరపున మంత్రులు ఎలా సమాధానం ఇస్తారు, స్పీకర్ సభను ఎలా నిర్వహిస్తారు వంటి విషయాలను విద్యార్థులు ప్రదర్శన ద్వారా వివరించారు. విద్యార్థుల ప్రసంగం, ప్రశ్నించే విధానం, సభా నియమాలను పాటించిన తీరు కార్యక్రమానికి హాజరైన వారిని ఆకట్టుకుంది. హెచ్‌ఎం నారాయణ విద్యార్థుల ప్రతిభను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, మాట్లాడే నైపుణ్యం, సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు.

### కాఫేడ్ సంస్థ కార్యక్రమాలకు అభినందనలు

ఈ సందర్భంగా కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న పిల్లల అభివృద్ధి కార్యక్రమాలను హెచ్‌ఎం నారాయణ అభినందించారు. విద్యార్థుల్లో చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించేందుకు సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల పిల్లలకు ఇటువంటి అవకాశాలు కల్పించడం వల్ల వారి ప్రతిభను వెలికితీసేందుకు మంచి వేదిక లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో సమాజ సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేలా ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.

### నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యం

కాఫేడ్ సంస్థ డైరెక్టర్ లూర్ధురాజు మాట్లాడుతూ పిల్లల పార్లమెంట్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడం, సభలో మాట్లాడే ధైర్యాన్ని పెంచడం అని తెలిపారు. దేశ పార్లమెంటులో జరుగుతున్న సభా విధానాలు, ప్రశ్నోత్తరాల సమయం, ప్రజా సమస్యలపై చర్చ, మంత్రుల సమాధానాలు, ప్రతిపక్ష సభ్యుల పాత్ర వంటి అంశాలను విద్యార్థులు తెలుసుకునేలా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పిల్లలు కేవలం పుస్తకాల్లో విషయాలను చదవడం మాత్రమే కాకుండా, వాటిని ప్రాక్టికల్‌గా తెలుసుకోవడం ద్వారా మరింత సులభంగా అర్థం చేసుకోగలరని తెలిపారు. మాక్ పిల్లల పార్లమెంట్ ద్వారా భవిష్యత్‌లో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించవచ్చని అన్నారు.

### విద్యార్థుల ప్రదర్శనకు డైరెక్టర్ లూర్ధురాజు అభినందనలు

కార్యక్రమంలో పాల్గొన్న కాఫేడ్ సంస్థ డైరెక్టర్ లూర్ధురాజు రాజు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పార్లమెంట్ పాత్రలను పోషించడం, సభా విధానాలను అర్థం చేసుకుని ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. పిల్లలు ప్రశ్నించడం, సమాధానం చెప్పడం, ఇతరుల అభిప్రాయాలను వినడం, సభా నియమాలను పాటించడం వంటి అంశాలను ఈ కార్యక్రమం ద్వారా నేర్చుకున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలకు సంస్థ తరపున సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

### పిల్లలలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి వేదిక

మాక్ పిల్లల పార్లమెంట్ కార్యక్రమం విద్యార్థులకు వినూత్నమైన అనుభవాన్ని అందించింది. సాధారణంగా పుస్తకాలలో చదివే పార్లమెంటరీ విధానాలను విద్యార్థులు ప్రత్యక్షంగా పాత్రధారణ ద్వారా ప్రదర్శించడం ద్వారా వాటిపై స్పష్టమైన అవగాహన పొందారు.

విద్యార్థులు ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురావడం, వాటిపై చర్చించడం, సంబంధిత మంత్రులు సమాధానం ఇవ్వడం వంటి అంశాలను ప్రదర్శించారు. దీంతో విద్యార్థుల్లో సమస్యలపై ఆలోచించే శక్తి, మాట్లాడే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, సమన్వయంతో పనిచేసే సామర్థ్యం పెంపొందే అవకాశం ఏర్పడింది.

### ఉపాధ్యాయులు, విద్యార్థుల హర్షం

కార్యక్రమం అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రదర్శనను అభినందించారు. పిల్లలకు ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించడం వల్ల వారి ప్రతిభతో పాటు సామాజిక అవగాహన కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. పిల్లల పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా తమ అనుభవాలను పంచుకున్నారు. పార్లమెంటు ఎలా పనిచేస్తుంది, స్పీకర్ బాధ్యతలు ఏమిటి, మంత్రులు మరియు ప్రతిపక్ష సభ్యుల పాత్ర ఏమిటి వంటి విషయాలను ప్రాక్టికల్‌గా తెలుసుకోవడం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. మొత్తంగా జెడ్‌పీ హైస్కూల్‌లో నిర్వహించిన సభ మాక్ పిల్లల పార్లమెంట్ కార్యక్రమం విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, మాట్లాడే నైపుణ్యం మరియు సామాజిక బాధ్యతను పెంపొందించే కార్యక్రమంగా నిలిచింది. ఇలాంటి కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లోని మరిన్ని పాఠశాలల్లో నిర్వహించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో వెంకటాపురం మండల సర్పంచ్ తాటి సరస్వతి కోఆర్డినేటర్స్ గొంది హనుమంత్ కామేష్. ప్రశాంత్ . నరేష్.బాస్కార్ ఉషా ఇందిరా పద్మ రమాదేవి సుజాల దీపరాణీ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు. వంశి. జయరాం శేషు నరసింహారావు ఉపాధ్యాయుల బృందం విద్యార్థులుపాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# ఆత్మ ఆధ్వర్యంలో పత్తి క్షేత్ర ప్రదర్శన

వెంకటాపూర్ (రామప్ప) ప్రభాతవార్త :
మండలంలోని కేశవపూర్ గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆత్మ ఆధ్వర్యంలో పత్తి క్షేత్ర ప్రదర్శన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిరప వరి పంటలు పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి శైలజ మాట్లాడుతూ.. ప్రతి పంట ఎరువుల వినియోగం, సూక్ష్మ పోషకాల యాజమాన్యం పై అవగాహన కల్పించి, గులాబీ రంగు పురుగు, రసం పీల్చే పురుగులు, తెగుళ్లు, చీడపీడలను గుర్తించి సకాలంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పత్తి పంటలో గులాబీ రంగుకాయ, తొలుచు పురుగు నివారణకు ఎకరానికి 8 చొప్పున లింగాకర్షక బుట్టలు అమర్చుకోవడం వలన పురుగు ఉధృతిని గమనించి నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. నివారణ కోసం ప్రొఫెనోఫాస్ 250 లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. వరి లో మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే 3 గుళికలు ఎకరాకు 8 చొప్పున వేయాలనీ, కార్బాఫ్ హైడ్రోక్లోరైడ్ 2గ్రాము/లీటర్ లీటర్ చొప్పున, బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు నియంత్రణ కి ప్లాంటమైసిన్ 2 మి.లీ/ లీటరు పిచికారి చేసి నివారించవచ్చని సూచించారు. రేజురీ శాస్త్రవేత్త డాక్టర్ విశ్వతేజ మాట్లాడుతూ పత్తి పంట లో పోషకాల లోప నియంత్రణకు 19:19:19 స్ప్రే సిఫార్సు చేశారు. మిరప పంటలో తామర పురుగుల నివారణకు పెగాసిస్ 0.5గ్రా/లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలనీ, అవసరమైన ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వినియోగించడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ సభ్యులు పోలాల ప్రభాకర్ రెడ్డి, ఏఈఓ నవీన్ , అన్నా సాంబయ్య , గొల్లపల్లి రవి, బాపు రావు, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.






## 'చదువుకు షెడ్డు.. అధికారులకు అడ్డు'

### వార్తకు స్పందన..

పేద విద్యార్థులకు అండగా ఉంటాం....
మల్లంపల్లి సర్పంచ్ శ్యామ్‌రావు...



మల్లంపల్లి, ప్రభాతవార్త:
మల్లంపల్లి ఆరో వార్డులో పేద విద్యార్థులకు ఉచితంగా నిర్వహిస్తున్న ట్యూషన్‌కు సంబంధించిన సమస్యపై మంగళవారం దినపత్రికలో వెలువడిన 'చదువుకు షెడ్డు.. అధికారులకు అడ్డు' వార్తకు మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు స్పందించారు. పేద విద్యార్థుల చదువుకు గ్రామపంచాయతీ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆరో వార్డు సభ్యులు మంగళవారం సర్పంచ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు ట్యూషన్ నిర్వహించేందుకు ఉపయోగిస్తున్న షెడ్డులో ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. దీనిపై సర్పంచ్ శ్యామ్‌రావు, ఉప సర్పంచ్‌తో పాటు పాలకవర్గం సానుకూలంగా స్పందించింది.

విద్యార్థుల చదువుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైతే షెడ్డులో లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామని సర్పంచ్ తెలిపారు. పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి గ్రామపంచాయతీ తరపున సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. సమస్యపై స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చిన సర్పంచ్ శ్యామ్‌రావు, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు ఆరో వార్డు ప్రజలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎయిడ్స్ నియంత్రణ పై అవగాహన



వెంకటాపూర్ (రామప్ప) ప్రభాతవార్త :
ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, జిల్లా మాతా సంరక్షణ అధికారి డాక్టర్ చీర్ల శ్రీకాంత్ సూచించారు. ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ కోసం జిల్లాలో ఆగస్టు 15 నుంచి అక్టోబర్ 12 వరకు అవగాహన కార్యక్రమాల నిర్వహణలో భాగంగా మంగళవారం వైద్యశాఖ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గృహ సందర్శనల సమయంలో ప్రజలకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలని, ప్రతి గర్భిణికి హెచ్‌ఐవీ, సిఫిలిస్ వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో జిల్లాలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కళాజాత బృందాల ద్వారా ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ప్రజలు తమకు తామే ఎయిడ్స్ ప్రమాదాన్ని అంచనా వేసుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన పోస్టర్‌ను ఈ కార్యక్రమంలో విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేసి సులభంగా స్వీయ అంచనా చేసుకోవచ్చని, ఈ పోస్టర్లను గ్రామాల్లో ప్రదర్శించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి రవితేజ, వెంకటాపూర్ పి హెచ్ సి సిబ్బంది సమ్మయ్య, మాడిశెట్టి శ్రీనివాస్, దుర్గారావు, పల్లె దవాఖానల వైద్యాధికారులు, ఉపకేంద్రాల ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఏసీటీసీ, దిశా సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కి పూర్వవైభవం తేవాలి. కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడాలి: బడే నాగజ్యోతి

**మాటలు కాదు ములుగు ప్రజలకు అభివృద్ధి కావాలి బడే నాగజ్యోతి అన్నారు.**

**రాబోయే ఎం ఎల్ సీ ఎన్నికల ఎన్రోల్మెంట్ మీద కూడా కార్యకర్తలు దృష్టి సారించాలి**

**ఇసుక లారీలతో రహదారులు ఛిద్రమవుతున్నా పట్టించుకోరా?**

**మంగపేట సెప్టెంబర్29, ప్రభాతవార్త:**





మంగపేట మండల బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుడుముల లక్ష్మి శ్రీ నారాయణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి హాజరై పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని స్పష్టం చేశారు. కార్యకర్తలే పార్టీకి బలమని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసి ములుగు నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం అలాగే రాబోయే శాసన మండలి ఎంఎల్సీ ఎన్నికల వస్తున్నందున గ్రాడ్యుయేట్ లతో ఓట్లు దగ్గరుండి ఎన్రోల్మెంట్ చెయ్యాలి అని కార్యకర్తలకు నాయకులకు దిశానిర్దేశం చేశారు మరియు మంత్రి సీతక్కపై బడే నాగజ్యోతి తీవ్రస్థాయిలో ధ్వజం ఎత్తారు ములుగు జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి సీతక్క తీరును బడే నాగజ్యోతి తీవ్రంగాతప్పుబట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? ప్రజలకు ఇచ్చిన మాటల్లో ఎన్ని అమలు చేశారో మంత్రి సీతక్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు మంగపేట నుండి ఎటూరునాగారం వరకు రహదారుల పరిస్థితి చూస్తే ప్రజలు భయపడే పరిస్థితి ఉందని, గుంతలతో నిండిన రోడ్లపై ప్రయాణిస్తూ ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని అన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం మంత్రికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు అధికారంలోకి వచ్చి ఇంతకాలం అయినా కనీస మౌలిక వసతులపై దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. రోడ్ల పరిస్థితి, గిరిజన విద్యార్థుల హాస్టళ్లు, విద్య, మౌలిక వసతులు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఇసుక లారీలతో రోడ్లు ధ్వంసం. ప్రజల బాధలు పట్టించుకునేది ఎవరు?మంగపేట మండలంలో అధిక సంఖ్యలో ఇసుక లారీలు తిరుగుతున్నాయని, భారీ వాహనాల రాకపోకలతో ఇప్పటికే అధ్వానంగా ఉన్న రహదారులు మరింత దెబ్బతింటున్నాయని బడే నాగజ్యోతి పేర్కొన్నారు ఇసుక లారీలు అధికంగా తిరుగుతున్నా వాటి వల్ల ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణ, రహదారుల పరిరక్షణ, ప్రజల భద్రత వంటి అంశాలపై అధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు రైతులకు 24గంటల ఉచిత కరెంట్ ను మా బీఆర్ఎస్ ప్రభుత్వం అందించడం జరిగింది కాని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 6 గంటలు కూడా త్రీఫేస్ కరెంట్ ఇయ్యలేకపోవడం వాళ్ళ రైతుల పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడి అన్నారు, ఇప్పటికైనా రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారుప్రజలు ప్రయాణించే రహదారులు గుంతలమయంగా మారుతుంటే.మరోవైపు భారీ ఇసుక లారీల రాకపోకలు కొనసాగుతున్నాయని ప్రజల ఇబ్బందుల కంటే ఇసుక రవాణానే ప్రభుత్వానికి ముఖ్యమైందా? అని బడే నాగజ్యోతి ప్రశ్నించారు బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి ఎక్కడ ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి ఎక్కడ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ములుగు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు గమనించారని బడే నాగజ్యోతి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ములుగు జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు స్పష్టంగా వివరించాలని మంత్రి సీతక్కను డిమాండ్ చేశారు రోడ్లు, హాస్టళ్లు, విద్య, గిరిజన ప్రాంతాల మౌలిక వసతులు, గ్రామీణ అభివృద్ధి వంటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ చూపించాలని అన్నారు. కేవలం ప్రకటనలు, హామీలతో ప్రజల సమస్యలు పరిష్కారం కావని, క్షేత్రస్థాయిలో పనులు జరగాలని పేర్కొన్నారు ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం ఆగదు ములుగు నియోజకవర్గ ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని బడే నాగజ్యోతి తెలిపారు. కార్యకర్తలు గ్రామగ్రామాన ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు ప్రజల సమస్యలను పరిష్కరించే వరకు ప్రశ్నిస్తాం. అవసరమైతే ప్రజల పక్షాన పోరాటం చేస్తాం అని స్పష్టం చేశారు రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మరింత బలపడుతుందని, కార్యకర్తల ఐక్యతతో ములుగు నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని బడే నాగజ్యోతి ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కుడుముల లక్ష్మీ శ్రీనారాయణ, మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోరం సంతోష్ మల్లూరు దేవస్థాన మాజీ చైర్మన్ నూతులకంటి ముకుందం, కాడబోయిన నరేందర్, పార్టీ సీనియర్ నాయకులు,చిలకమర్రి రాజేందర్, కర్రీ శ్యాంబాబు, గుమ్మల వీరాస్వామి, గుండారాపు రమేష్, అచ్చ సత్యనారాయణ, సింగారిబోయిన నర్సయ్య,బాబు రావు,మాజీ మహిళా మండల అధ్యక్షురాలు, కాటూరి సుగుణ, పార్టీ నాయకులు,యూనిస్, అఫ్జల్ , భూట్టో, చల్లగురుగుల తిరుపతి, బాలకృష్ణ, వస్ర నాయక్, ఇదునూరి రవీందర్, అమిలి చంద్రం,ఉడుగుల శ్రీనివాస్ యాదవ్, మార్పుల వెంకట్ రెడ్డి, రావుల రమణ,రొడ్డ సుదర్శన్, తోలెం నర్సింహా రావు, గోపాల్, కోరెం వెంకటేశ్వర్,పంజాల సత్యం, నాగరాజు, యూత్ నాయకులు గౌని రమేష్, పిల్లలమర్రి వేణు, గుడివాడ శ్రీహరి, సారయ్య, తదితరులు పాల్గొన్నారు,




## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాజశేఖర్ కు ఘన సన్మానం



**ప్రభాతవార్త ఏటూర్ నాగారం సెప్టెంబర్ 29:**

మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ నార్త్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ, విద్యా సేవలందిస్తున్న పోతు రాజశేఖర్ కు సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ జిల్లా "ఉత్తమ ఉపాధ్యాయ" అవార్డుతో గౌరవంగా సత్కరించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్టేట్ టీచర్స్ యూనియన్ ఎటుర్ నాగారం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు . ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు పోతు రాజశేఖర్ తన ఉపాధ్యాయ వృత్తి జీవితంలో గత 14 సంవత్సరాలుగా విద్యార్థులకు ఉత్తమ విద్యా సేవలందిస్తున్నారనీ అన్నారు. రాజశేఖర్ విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే మార్గదర్శి అని విజయానికి బాటలు వేసే స్ఫూర్తి ప్ర దాత, సమాజ నిర్మాణానికి పునాది వేసే గొప్ప ఆదర్శ ఉపాధ్యాయుడు పోతు రాజశేఖర్ అని తన విధి నిర్వహణలో చూపే అంకితభావం, క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల ఆప్యాయత, బోధన పట్ల నిబద్ధత నిజంగా అభినందనీయం, స్ఫూర్తిదాయకం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపుప్రధాన కార్యదర్శి ఎస్ బి నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు ఉట్నూరి రాంబాబు, జిల్లా కార్యదర్శి గజవెల్లి విష్ణుమూర్తి , మండల ఉపాధ్యక్షులు అంగోతూ సుమన్, కార్యదర్శి గుమ్మల రవీందర్, కన్నాయిగూడెం మండల అధ్యక్షులు నరిగే రమేష్, వాజేడు మండల ఉపాధ్యక్షులు దాసుల నాగార్జున, రవీందర్ , వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కేయూలో రవా ఏఐ వ్యవస్థాపకుడు కిరణ్ బాబుతో ఇంటరాక్టివ్ గెస్ట్ సెషన్



**ఎడ్యుకేషన్ కేయూ సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :**

కాకతీయ విశ్వవిద్యాలయం కేహబ్ ఆధ్వర్యంలో, హైదరాబాద్ టిహబ్‌తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా స్టూడెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు కేహబ్ డైరెక్టర్ ఆచార్య టి. సవితా జ్యోత్స్న తెలిపారు. విశ్వవిద్యాలయ సెనేట్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన రవా ఏఐ వ్యవస్థాపకుడు, సీఈఓ, అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, గూగుల్ మాజీ ఉద్యోగి కిరణ్ బాబుతో ఇంటరాక్టివ్ గెస్ట్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో తన అనుభవాలను పంచుకున్నారు. 2023లో రవా ఏఐ సంస్థను స్థాపించే క్రమంలో ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించిన విధానాన్ని వివరించిన కిరణ్ బాబు, డీప్‌టెక్ స్టార్టప్‌లు, సిలికాన్ వ్యాలీ స్టార్టప్ ఎకోసిస్టమ్‌పై తన అనుభవాలను పంచుకున్నారు. వాస్తవ జీవిత సమస్యలను గుర్తించి, వాటికి సాంకేతిక పరిష్కారాలను రూపొందించడం ద్వారా స్కేలబుల్, పెట్టుబడులకు అనుకూలమైన స్టార్టప్‌లుగా అభివృద్ధి చేయగల విధానాలను వివరించారు. విద్యార్థులు తమ ఆలోచనలను విశ్లేషించి, వాటి సాధ్యాసాధ్యాలను అంచనా వేసి, మెంటార్లు, ఇంక్యుబేటర్లు, పెట్టుబడిదారుల ముందు ఆత్మవిశ్వాసంతో ప్రదర్శించేలా ప్రాక్టికల్ మార్గదర్శకత్వం అందించారు. స్టూడెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, నోడల్ ఆఫీసర్ ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి పర్యవేక్షి ంచారు. ఈ కార్యక్రమంలో కేహబ్ జాయింట్ డైరెక్టర్ సిద్ధార్థ్, ఎంపిక చేసిన విద్యార్థులు పాల్గొన్నారు. సెషన్ బుధవారం కూడా కొనసాగుతుందని ఆచార్య సవితా జ్యోత్స్న తెలిపారు.

# నల్లెల కుమారన్న సేవలు మరువలేనివి

**మంగపేటలో నల్లెల కుమారస్వామి జయంతి వేడుకలు**



**మంగపేట సెప్టెంబర్29, ప్రభాతవార్త:**

మంగపేట మండలం లో కుమారన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన చేట్టి పెల్లి వెంకటేశ్వర్లు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్న సూచనల మేరకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య మంగపేట మండల అధ్యక్షులు చేట్టిపల్లి వెంకటేశ్వర్లు హాజరై కేక్ కట్ చేసి నల్లెల కుమారస్వామి కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ,నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దివంగత నేత నల్లెల కుమారస్వామి సేవలు చిరస్మరణీయం కాంగ్రెస్ పార్టీకి, ములుగు జిల్లా సాధన ఉద్యమానికి ఆయన చేసిన సేవలు మరువలేనివి నల్లెల కుమారస్వామి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు, పార్టీ సిద్ధాంతాల కోసం ఆయన సాగించిన నిరంతర పోరాటం ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన అహర్నిశలు కృషి చేశారని, పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలిచిన నాయకుడిగా కుమారన్న ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ములుగు ప్రాంత ప్రజల హక్కులు, అభివృద్ధి కోసం కుమారస్వామి ముందుండి పోరాడారని గుర్తు చేశారు. ములుగు జిల్లా సాధన ఉద్యమంలో ఆయన కీలకంగా వ్యవహరించి, ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో, ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో విశేష కృషి చేశారని తెలిపారు. జిల్లా సాధన కోసం వివిధ వర్గాలు, రాజకీయ శక్తులను సమన్వయం చేస్తూ ఉద్యమానికి బలమైన నాయకత్వం అందించారని పేర్కొన్నారు. ములుగు జిల్లా ఏర్పాటులో ప్రజా ఉద్యమాలు, వివిధ వర్గాల భాగస్వామ్యం కీలకంగా ఉన్నప్పటికీ, కుమారస్వామి వంటి నాయకులు ఉద్యమాన్ని రాజకీయంగా సమన్వయం చేసి ప్రజల ఆకాంక్షను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో చేసిన కృషి ప్రత్యేకంగా స్మరించుకోవాల్సినదని అన్నారు. కుమారస్వామి మరణం కాంగ్రెస్ పార్టీకి, ములుగు ప్రాంతానికి తీరని లోటని వెంకటేశ్వర్లు అన్నారు. నల్లెల కుమారస్వామి సేవలు, త్యాగాలు, ప్రజా ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్ర ములుగు జిల్లా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు. జిల్లా నాయకులు. మండల నాయకులు. గ్రామ నాయకులు. మండల యూత్ నాయకులు మహిళా నాయకులు వివిధ అనుబంధ సంఘాలు అభిమానులు తదితరులు పాల్గొని నల్లెల కుమారస్వామి గారికి ఘన నివాళులు అర్పించారు.

# ముస్లిం మైనారిటీ పెద్దలకు షాదీఖానా స్థల కేటాయింపు పత్రం అందజేసిన ఎమ్మెల్యే

- రాజకీయాలకు అతీతంగా మైనార్టీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- గత పాలకులు మైనార్టీలను కేవలం ఓట్ల కోసమే ఉపయోగించుకున్నారు..
- అందరి ఆమోదంతో అనువైన స్థలాన్నే కేటాయిస్తున్నాం: ఎమ్మెల్యే నాయిని...

**ప్రభాతవార్త సుబేదారి:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలకు షాదీఖానా నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా 0.25 గుంటల స్థల కేటాయింపు పత్రాన్ని మత పెద్దలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు అందజేశారు. మంగళవారం మైనార్టీ మత పెద్దలు, పెద్దల సమక్షంలో కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో షాదీఖానా నిర్మాణం కోసం ఒక స్థలాన్ని కేటాయించినప్పటికీ, ఆ స్థల పరిస్థితులు, భవిష్యత్తులో నిర్మాణానికి ఎదురయ్యే ఇబ్బందులను అధికారులు పరిశీలించారని తెలిపారు. గతంలో ఆ ప్రాంతంలో భద్రకాళి అమ్మవారి మట్టి తీసుకువచ్చి స్థలాన్ని పూడ్చడం జరిగిందని, అక్కడ నిర్మాణం చేపడితే భవనం పునాదులు కుంగిపోయే అవకాశం ఉందన్న సాంకేతిక అంశాలను అధికారులు గుర్తించారని వివరించారు. మైనార్టీలకు మంచి వసతులతో షాదీఖానా నిర్మించాలన్న



ఉద్దేశంతోనే పాత స్థలానికి ప్రత్యామ్నాయంగా మరింత అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అయితే ఈ నిర్ణయాన్ని కొందరు రాజకీయంగా విమర్శిస్తూ, గతంలో కేటాయించిన స్థలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందంటూ తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించకుండా రాజకీయ లబ్ధి కోసం మైనార్టీలను తప్పుదోవ పట్టించడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికే మత పెద్దలు, స్థానిక పెద్దలతో కలిసి స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించామని, రహదారి సౌకర్యం, స్థల పరిస్థితులు, భవిష్యత్ నిర్మాణానికి అనుకూలత వంటి అంశాలను వారికి స్వయంగా వివరించామని చెప్పారు. అందరికీ ఆమోదయోగ్యంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉండే స్థలాన్ని ఎంపిక చేసుకునే అవకాశాన్ని మత పెద్దలకే కల్పించామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మైనార్టీల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తోందని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. షాదీఖానా నిర్మాణంతో ముస్లిం మైనార్టీ కుటుంబాలకు వివాహాలు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సౌకర్యం కలుగుతుందని తెలిపారు. అవసరమైన తదుపరి చర్యలను అధికారులతో సమన్వయం చేసుకుని వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాజీపేట దర్గా పీఠాధిపతి కుసురు పాషా, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ అజిత్ ఉల్లా, మాజీ కార్పొరేటర్లు అబుబకర్, నసీం జాన్, విజయశ్రీ రాజాలీ, నాయకులు అంకుస్, బాబాయ్, ముజాహిద్, సమీ, మైనార్టీ మత పెద్దలు, స్థానిక నాయకులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు గ్రామంలో ఘనంగా ప్రారంభమైన ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక శిబిరం

**కమలాపూర్ ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాల, కమలాపూర్ ఆధ్వర్యంలో గూడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక శిబిరం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గూడూరు గ్రామ సర్పంచ్ బండి వనజ కళాధర్, కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ హాజరయ్యారు. గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లకు స్వాగతం పలికి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండి వనజ కళాధర్ మాట్లాడుతూ.. "నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు. చదువుతో పాటు సమాజ సేవలో కూడా ముందుండాలి. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలి. ఎన్.ఎస్.ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెరుగుతుంది" అని అన్నారు. కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ.. "గ్రామం అభివృద్ధి చెందాలంటే పరిశుభ్రత, పచ్చదనం, విద్యపై అవగాహన చాలా అవసరం. ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు గ్రామంలో చేసే ప్రతి చిన్న సేవా కార్యక్రమం పెద్ద మార్పుకు నాంది పలుకుతుంది. మీ సేవలు గూడూరు గ్రామానికి ఆదర్శంగా నిలవాలి. మీరు నేర్చుకున్న మంచిని గ్రామ ప్రజలకు పంచాలి" అని వాలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కమలాపూర్ ప్రిన్సిపాల్ కుమార్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జ్యోతి, వార్డు



సభ్యులు, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, గూడూరు గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకు ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక శిబిరం లక్ష్యాలు, ఆశయాలపై అవగాహన కల్పించారు. గ్రామ సేవ, పరిశుభ్రత, పచ్చదనం పర్యావరణ పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ, సామాజిక బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం వాలంటీర్లు గ్రామంలో సేవా కార్యక్రమాలను ఉత్సాహంగా ప్రారంభించారు. "నేను కాదు నీవు సేవే లక్ష ్యం, సమాజ అభివృద్ధే ఎన్.ఎస్.ఎస్ ధ్యేయం" అనే నినాదంతో మొదటి రోజు శిబిరం విజయవంతంగా ముగిసింది.

# భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్

**పరకాల సెప్టెంబర్ 29 (ప్రభాతవార్త):**

భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకొని, నేటి పాలకుల నిరంకుశ పోకడల నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ పరకాల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన విస్తృత స్థాయి సెమినార్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా దామెర కిరణ్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థలు కేంద్ర పాలకుల చేతిలో బంధీలుగా మారుతుండటం తీవ్ర ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రధానంగా జ్ఞానేశ్ కుమార్ అవలంబిస్తున్న పక్షపాత ధోరణి, ఏకపక్ష నిర్ణయాలు ప్రజాస్వామ్య పునాదులనే కదిలిస్తున్నాయని విమర్శించారు. జ్ఞానేశ్ కుమార్ హయాంలో రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉంటూ నిష్పాక్షికంగా వ్యవహరించాల్సి ఉండగా, అధికార పక్ష ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కరూ అన్నారు. ఎన్నికల నిర్వహణ, విధివిధానాల్లో ప్రజాస్వామ్య సూత్రాలను పక్కనబెట్టి, అత్యంత గోప్యంగా, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం. ప్రజాస్వామ్యం కి తూట్లు పొడవటం మే అని వాపోయారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక సూత్రాలకు, సమానత్వ హక్కులకు




విఘాతం కలిగిస్తూ నిర్ణయాలు అమలు చేయడం. అనేది నియతల వ్యవహరించటం వల్లన ప్రజాస్వామ్య దేశం లో అలాంటి నియంతలకు చోటు లేదు అన్నారు. స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థలవిశ్వసనీయతను దెబ్బతీసి, ప్రజలకు ఆయా వ్యవస్థలపై ఉన్న నమ్మకాన్ని పూర్తిగా సడలేలా చేయడం. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని దామెర కిరణ్ డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన ప్రాథమిక బాధ్యత విద్యార్థి లోకంపైనే ఉందన్నారు. యువత, విద్యార్థులు చైతన్యవంతమై రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం పెద్ద ఎత్తునపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐజిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, పరకాల మండల అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, మండల కార్యదర్శి సాయి తేజ, పట్టణ అధ్యక్షుడు బొజ్జ హేమంత్, పట్టణ కార్యదర్శి అఫ్రోజ్, పరకాల పట్టణ బాలికల కన్వీనర్ శ్రీ వర్ష, శాయంపేట మండల అధ్యక్షుడు ఇస్మాయిల్, మండల ఉపాధ్యక్షుడు రాహుల్, పట్టణ ఉపాధ్యక్షుడు వినీత్, సన్నీ, విద్యార్థులు పాల్గొన్నారు.




# జిల్లా గ్రంథాలయం చైర్మన్ అజీజ్ ఖాన్‌కు పుస్తక వితరణ చేసిన సత్యనారాయణ దంపతులు

**ప్రభాతవార్త సుబేదారి:** హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ భవనంలో




మంగళవారం రోజు ఉదయం ఎస్సార్ కళాశాల అధ్యాపకులు సత్యనారాయణ లావణ్య దంపతులు జిల్లా గ్రంధాలయాలు సంస్థకు జేఈఈ కి సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్ కి పుస్తక వితరణ చేశారు ఈ కార్యక్రమంలో అజీజ్ ఖాన్ మాట్లాడుతూ పేద మధ్యతరగతి విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ఉపయోగపడే విధంగా పుస్తక వితరణ చేసిన సత్యనారాయణ దంపతులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# సాయి శివాని వృద్ధాశ్రమాన్ని ప్రారంభించిన జనసేన జిల్లా నాయకురాలు పద్మజా దేవి

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న జనసేన అధికార ప్రతినిధి

ఆర్‌కే సాగర్(నాయుడు)

**ప్రభాతవార్త సుబేదారి:** హనుమకొండ ఎక్సైజ్ కాలనీలో మంగళవారం



రోజు ఉదయం జనసేన అధికార ప్రతినిధి ఆర్కే నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని పద్మజా దేవి ఆధ్వర్యంలో సాయి శివాని వృద్ధాశ్రమాన్ని ప్రారంభోత్సవం చేశారు. పద్మజాదేవి మాట్లాడుతూ సాయి శివాలయం కల్చరల్ సంస్థను స్థాపించి 25 సంవత్సరాలు గడిచిన తరుణంలో ఈరోజు వృద్ధాశ్రమానికి శ్రీకారం చుట్టానన్నారు . ఈ సందర్భంగా పద్మజా దేవి మాట్లాడుతూ వృద్ధులను గౌరవించడం ఆదరించడం ఆశ్రయించడం ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని ఇది ఒక బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తానని అందరి ఆదరాభిమానాలను పొందుతానని వృద్ధాశ్రమాలను నిర్వహించడం బాధాకరమైన విషయమై కానీ ఎందరో అభాగ్యులు ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితులను చూసి ఈ నిర్ణయం తీసుకున్నానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జనసేన వీర మహిళా అధ్యక్షురాలు కావ్య ముదిరాజ్, అధికార ప్రతినిధి ప్రేమ్ గాంధీ ,సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్

**దుగ్గొండి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :**

మహిళా సాధికారత, స్వయం ఉపాధి లక్ష్యంగా గుడిమహేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ కూరతోట స్వప్న సురేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతోనే ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు ఇంటి వద్దనే ఉండి ఉపాధి పొందే అవకాశం కలుగుతుందని అన్నారు. ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, శిక్షణ నిపుణులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వరంగల్ వార్త

## వికసిత్ గ్రామపంచాయతీ రూపకల్పనపై సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ

**గీసుగొండ సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:**

మండల ప్రజా పరిషత్ గీసుగొండలో వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక తయారీ పై సర్పంచులకు, కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, మేటి లకు శిక్షణ కార్యక్రమాన్ని ఇన్చార్జి ఎంపీడీవో కమలాకర్ ,ఎంపీ ఓ శేషాంజనేయులు నిర్వహించారు. శిక్షణ ఇచ్చుటకు ఏపీవో చంద్రకాంత్, ఈసీ శ్రీలత పాల్గొన్నారు. విజిపిపి అనగా వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక తయారీ పథకంలో ఉన్న (375) అనుమతించిన పనులను అందరికీ వివరించడం ప్రణాళికలు ఏ విధంగా తయారు చేయాలో తెలియజేయడము అలాగే గ్రామంలో రిసోర్స్ మ్యాపు / గ్రామ సహజ వనరుల మ్యాపును ఏ విధంగా రూపొందించాలి, నాలుగు కేటగిరీల పనులను ఎక్కడెక్కడ ఏ పనులను తీసుకోవాలని పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగింది.అక్టోబర్ఖి 02 వ తారీఖు జరిగే గ్రామ సభలో విజిపిపిని ఆమోదించి జూన్ 2027 వరకు ఆక్షన్ ప్లాన్ ను రూపొందించి పనులను



అంచనా, ఆమోదం కు పంపి మంజూరైన తదుపరి చేపట్టాలని తెలియజేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచులు, తివీ పి.హరి ప్రసాద్ బాబు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శిలు, ఫీల్డ్ అసిస్టెంట్లు మేట్లు పాల్గొన్నారు.

## సూర్యతండ ప్రభుత్వ పారశాలలో విద్యార్థులకు యూనిఫాం, షూ, బెల్టుల పంపిణీ

**- సర్పంచ్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో**

**గీసుగొండ సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:**

వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని సూర్య తండా గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ యూనిఫాం, షూ, బెల్టులను సర్పంచి రాఘవేంద్ర పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు రాఘవేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడి, నైతిక విలువలను అలవర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సుధారాణి, ఉపాధ్యాయుడు రజినీకాంత్ సూర్యతండ జీ పీ ఓ రవికుమార్, మహిళా



సంఘం సిసి శ్రీలత,సిఏ రాజు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## తూర్పుపై పూర్తి ఫోకస్

**- కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగిస్తే చూస్తూ ఊరుకోం**

**- ఇష్టానుసారంగా మాట్లాడుతే మహిళలే తగిన బుద్ధి చెబుతారు**

**- త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నూతన కలెక్టరేట్ ప్రారంభం**

**- అర్హులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ**

**వరంగల్ సిటీ సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకునేలా చూస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ వరంగల్ ఓ సిటీ లోని క్యాంపు కార్యాలయంలో 61 లక్షల 61వేల రెండు వంద రూపాయల విలువ గల మొత్తం111 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ మాట్లాడుతూ పేద వర్గాల ప్రజలు అనారోగ్యం కారణంగా చికిత్సకు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందిస్తూ అండగా నిలుస్తుందని ఆమె తెలిపారు. రాష్ట్రంలోని



నిరుపేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తూ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే తూర్పు నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని తెలిపారు. డివిజన్ లోని సమస్యలపై డివిజన్ నాయకులతో చర్చించి పరిష్కరించేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇక నుంచి తూర్పు లో పూర్తి ఫోకస్ ఉంటుందని అన్నారు. కొందరు పని గట్టుకొని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతే చూస్తూ ఊరుకోమని నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. నోరు జారీ ఇష్టానుసారంగా మాట్లాడుతే మహిళా కార్యకర్తలు కొడుతారని అన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పార్టీని గెలిపించాలని కోరారు. తూర్పు లో 24 కార్పొరేటర్ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పని చేయాలని ఆమె సూచించారు. అలాగే త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నూతన కలెక్టరేట్ ప్రారంభం అవుతుందని అన్నారు.చెక్కుల పంపిణీ కార్యక్రమం లో తూర్పు నియోజకవర్గంలోని నాయకులు, మహిళా కార్యకర్తలు, కొండా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మామునూరు ఎయిర్ ఫీల్డ్‌ను సందర్శించిన అధికారులు

**వరంగల్ సిటీ సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:**

వరంగల్ లోని మామునూరు ఎయిర్ ఫీల్డ్, ఎన్ సిసి గ్రూప్ ను సందర్శించిన ఎయిర్ కమడోర్ నరసింగ్ సైలానీ డిప్యూటీ డీజీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్ సిసి డైరెక్టర్.ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 13 వరకు తాంబరంలో జరగనున్న ఆల్ ఇండియా వాయు సైనిక్ క్యాంప్ లో క్యాడెట్ల భాగస్వామ్యానికి సంబంధించిన ఏర్పాట్లను సమీక్షి ంచేందుకు మామునూరు ఎయిర్ ఫీల్డ్‌ను సందర్శించినట్లు తెలిపారు.




ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను బహూకరించినట్టు తెలిపారు. ఆల్ ఇండియా వాయుసేన క్యాంప్ పోటీలో పాల్గొనబోయే బృందంతో అయన ముచ్చటించి, వారిని ప్రోత్సహించారు. కమాండర్ కల్నల్ రాజేష్ స్వాగతం పలికారు. తన పర్యటనలో భాగంగా డిప్యూటీ డిజి, వరంగల్ గ్రూప్ పరిధిలోని అన్ని బెటాలియన్ల కమాండింగ్ ఆఫీసర్లు, సిబ్బందితో శిక్షణా, పరిపాలనాపరమైన అంశాల తాజా అప్‌డేట్‌లపై చర్చించారు. క్యాడెట్లకు ఎంతో ఆసక్తి అంకితభావంతో శిక్షణ



ఇచ్చినందుకు గాను ట్రైనర్లకు ఆయన ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. అనంతరం పోలీస్ శిక్షణ కళాశాలలో జరిగే క్యాంపు ను సందర్శించి ఎన్ సిసి శిక్షణ పొందుతున్న క్యాడేట్లను అభినందించారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

**- వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిని పరిశీలించిన సీపీ శ్వేత**

**వర్ధన్నపేట/సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** వర్ధన్నపేట మండలం



ఉప్పరపల్లి, ఇల్లంద, మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి 563 పై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. వర్ధన్నపేట పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించి ప్రమాదాలకు కారణమవుతున్న పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు.జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లను ఆక్రమించి నిర్మించిన గృహాలు, దుకాణాలు, షెడ్లు, ఇతర నిర్మాణాల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా రహదారి మలుపులు, కూడళ్లు, అధిక రద్దీ ప్రాంతాల్లో ప్రమాదాల ముప్పు అధికంగా ఉన్నట్లు పరిశీలనలో తేలింది. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారి మార్జిన్‌లలో ఉన్న ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను సీపీ ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు స్పీడ్ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ ఎన్. శ్వేత మాట్లాడుతూ రోడ్డు భద్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. రహదారులను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. ప్రమాదాల నివారణకు పోలీస్, మున్సిపల్, నేషనల్ హైవే, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. అనంతరం ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్న ప్రాంతాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి, భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అధికారులు, డీసీపీ రాజమహేంద్ర నాయక్, మున్సిపల్ ఛైర్మన్ పాలకుర్తి సారంగపాణి, రెవెన్యూ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వరంగల్ రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యుడిగా డాక్టర్.గజవెల్లి రాజ్ కుమార్ప్రమాణ స్వీకారం

**వర్ధన్నపేట/సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ



వరంగల్ జిల్లా పాలక మండలి ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో ఛైర్మన్‌గా భేతి అశోక్ బాబు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, పాలక మండలి సభ్యుడిగా రెండవ సారి డాక్టర్ గజవెల్లి రాజ్ కుమార్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ గజవెల్లి రాజ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నియామక పత్రాన్ని అందుకున్నారు. రెడ్ క్రాస్ సొసైటీ వంటి ప్రతిష్టాత్మక మానవతా సేవా సంస్థలో పాలక మండలి సభ్యుడిగా డాక్టర్ గజవెల్లి రాజ్ కుమార్ బాధ్యతలు స్వీకరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.డాక్టర్ గజవెల్లి రాజ్ కుమార్‌తో పాటు నూతన పాలక మండలి సభ్యులను ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం, వైద్య సహాయం, అత్యవసర సేవలు, విపత్తుల సమయంలో సహాయక కార్యక్రమాలు, పేదలు మరియు ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే సేవలను మరింత విస్తృతం చేయాలని పలువురు ఆకాంక్షి ంచారు.డాక్టర్ గజవెల్లి రాజ్ కుమార్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని పలువురు కోరారు. ఆయన ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం లభించి, అవసరంలో ఉన్న ప్రజలకు వేగంగా సహాయం అందేలా కృషి చేయాలని ఆకాంక్షి ంచారు.

# నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే లక్ష్యం

**- ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**- సీసీరోడ్ల ప్రారంభం.. నిర్మాణపనులకు శంకుస్థాపన**

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధిచేయడమే ప్రభుత్వ లక్ష్యం అని నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మంగళవారం జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం వనపర్తి గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించి అనంతరం రూ.20లక్షలతో నిర్మించనున్న సిసిరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం కొత్తపల్లి గ్రామంలో 37.50లక్షలతో నిర్మించిన పలు సిసిరోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంగాని, గత ఎమ్మెల్యేగాని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లని గొప్పులుచెప్పి వనపర్తి గ్రామానికి గాని, కొత్తపల్లి గ్రామానికిగాని ఒక్కఇల్లు ఆయినా ఇచ్చిందా అని ప్రశ్నించారు. గతఎమ్మెల్యే ఏరకంగా పనిచేశాడు.. ప్రస్తుతం ఎమ్మెల్యే ఏరకంగా పని చేస్తున్నాడో ఒకసారి ఆలోచించాలని సూచించారు. నా35ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవరిదగ్గర ఒక్క రూపాయి అవినీతికి పాల్పడలేదని, నిజాయితీగా పనిచేయడం మాత్రమే నాకు తెలుసని అన్నారు. 24ఏళ్ల క్రితంనేను శంకుస్థాపన చేసిన దేవాదుల ప్రాజెక్టు నేడు పూర్తయి నియోజకవర్గానికి సాగునీరు అందించడం నాకు చాలాసంతృప్తినిస్తుందని వెల్లడించారు. దేవాదుల శంకుస్థాపన చేసిన నాడు పూర్తయి సాగునీరు అందించేనాడు నేను ఎమ్మెల్యేగా ఉన్నానని, ఒక రాజకీయ నాయకునికి, ప్రజా ప్రతినిధికి ఇంతకన్నా కావాల్సింది ఏముంటుందన్నారు. ఇప్పటికి దేవాదులపేరు చెబితే కడియం శ్రీహరి గుర్తుకువస్తాడని తెలిపారు. లింగాలఘనపూర్ మండలంలోని ప్రతీఎకరానికి రెండు పంటలకు సాగునీరు అందించే బాధ్యత నాదని తెలిపారు. వనపర్తి గ్రామానికి మొదటిసారి ఎమ్మెల్యే అయ్యానని, అయినా వనపర్తి గ్రామానికి నాకు ఎంతో అనుబంధం ఉందని తెలిపారు. 25ఏళ్ల క్రితమే వనపర్తిలో పాలకేంద్రానికి భవనం మంజూరుచేసి నిర్మాణం



చేయించినట్లు గుర్తుచేశారు. 3ఏళ్లలో ఒక్క వనపర్తి గ్రామఅభివృద్ధికి 2కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వనపర్తి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. వనపర్తి గ్రామానికి సాగునీరు, విద్యుత్ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, బిటీరోడ్లు, సిసిరోడ్ల త్వరలోనే మంజూరు చేయించి పనులు చేయిస్తానని హామీఇచ్చారు. లింగాలఘణపూర్ మండలం కొత్తపల్లి గ్రామాన్ని ఫైలెట్ గ్రామంగా ఎంపికచేసి గ్రామంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. కొత్తపల్లి గ్రామం అభివృద్ధి చెందుతుంది అంటే అది కడియం శ్రీహరివల్లనే అని స్పష్టంచేశారు. కొత్తపల్లి నుండి డిక్షతండా వరకు 85లక్షలతో రోడ్డు మంజూరు అయిందని, అలాగే కొత్తపల్లి నుండి లింగాలఘనపూర్ వరకు హ్యామ్‌పథకం కింద రూ.9కోట్లతో డబుల్ రోడ్డు మంజూరైందని త్వరలోనే పనులు ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల సంక్షేమానికి కృషిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. కార్యక్రమంలో వనపర్తి, కొత్తపల్లి గ్రామాల సర్పంచులు వంచాలైజ ఉపేందర్ రెడ్డి, గాదెపాక విష్ణు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు గుడివంశీధర్ రెడ్డి, దిలీప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ శివకుమార్, మండలపార్టీ అధ్యక్షుడు విజయ్ మనోహర్, వివిధ గ్రామాల సర్పంచులు, తహసీల్దార్, ఎంపిడివో, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- సర్పంచ్ నర్సింగరావు**

బచ్చన్నపేట, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :



బచ్చన్నపేటలో జాతీయ పోషణమాసం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సర్పంచ్ నర్సింగరావు, సీడీపీవో మణెమ్మ సూచించారు. బచ్చన్నపేటలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో వారు మాట్లాడారు. చిన్నారుల జీవితంలోని తొలి వేయిరోజులు వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అత్యంత కీలకమని తెలిపారు. పిల్లలకు నెలలవారీగా అవసరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంతోపాటు పిల్లలఆరోగ్యం, ఎదుగుదలను క్రమంతప్పకుండా పర్యవేక్షించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రజిత, సూపర్‌వైజర్ కవిత, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు

**- ఏఓ మమత**



నర్మెట, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:

ఎరువులషాపు యజమానులు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నర్మెట మండలవ్యవసాయ అధికారిణి బుర్ర మమతా హెచ్చరించారు. నర్మెట మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం తనిఖీచేసిన ఆమె స్టాకురిజర్లను, సోర్స్ సర్టిఫికెట్లను, లైసెన్సులను ఫామ్.ఓ.ను పరిశీలించారు. ఎన్సీకే గ్రాండ్యులేటెడ్ మిశ్రమాల తయారీకి రాష్ట్రంలో ఎలాంటి అనుమతులు లేవని, ఎవరైనా అలాంటి ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికధరలకు ఎరువులు విక్రయించినా.. నకిలీలు విక్రయించినా.. రైతులు తనదృష్టికి తీసుకురావాలని వ్యవసాయాధికారి ఈ సందర్భంగా కోరారు.

## పార్టీలకు అతీతంగా సంక్షేమపథకాలు అమలుచేయాలి

**- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

నర్మెట, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :



పార్టీలకు అతీతంగా సంక్షేమపథకాలను అర్హులైన వారందరికీ అందించాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని పలుగ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ 14చెక్కులను తహసిల్దార్ కలకుంట్ల వెంకట రామానుజాచార్యులతో కలిసి పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన వారందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిదురాల సుమన్, డిటి కురికాల వేణు, ఆర్ఐ సాయిబాబా, ఎస్ .ఏ.యాదయ్య, సర్పంచులు గోపగోని శ్రీధర్‌గౌడ్, డాక్టర్ పగిడిపాటి రాజు, ఆంజనేయులు, భూక్య శంకర్‌నాయక్, లింగాల హైమా రమేష్, పందుగ జ్యోతి రమేష్, బానోతు రమేష్, భానోత్ మహేందర్, సీనియర్ నాయకులు గద్దల నర్సింగారావు, తేజావత్ గోవర్ధన్, చింతకింది సురేష్, నీరటి సుధాకర్, ఎండి.గౌస్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ వార్త



## కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీచేసిన ఎమ్మెల్యే పల్లా

తరిగొప్పుల, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :



తరిగొప్పుల మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మండలానికి చెందిన 17మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండోవిడత మొదటిజాబితాలో అర్హులైనపేదలకు మాత్రమే ఇళ్లఅందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని అన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు రూపొందించిన ఎల్2, ఎల్3 కేటగిరీ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి నిజమైన పేదలకు ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తరిగొప్పుల లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని, లిఫ్ట్‌కోసం మోటార్లు చేరాయని, వాటి బిగింపుపనులు, అవసరమైన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. వేగవంతంగా పనులు పూర్తిచేసి దసరా కానుకగా రైతుల పొలాలకు నీరందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం తరిగొప్పుల గ్రామ మాజీ ఉపసర్పంచ్ అంకం శ్రీనివాస్ తల్లి అంకం రాములమ్మ ఇటీవల మరణించగా భాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మొసిన్ ముస్తాబా, మండల ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

తరిగొప్పుల, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :



తరిగొప్పుల మండలకేంద్రంతో పాటు అక్కరాజుపల్లిలో ఆయా గ్రామపార్టీ అధ్యక్షులు పందుగ కనకయ్య, జొన్నగోని నర్సింహులు ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్‌పార్టీ మండలఅధ్యక్షుడు వగలబోయిన యాదగిరి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసానిస్తోందని, సీఎంరేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రతి పేదవాడికి వైద్య సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అర్హులైన ప్రతిఒక్కరూ సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుని ప్రయోజనం పొందాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బ్రుంగి శివకుమార్, అర్జుల పోషిరెడ్డి, పింగిలి ఇంద్రారెడ్డి, గోరంతల వీరన్న, దామెర లూకా, కల్వ రాజు, సిరిగిరి దాసు, లావుడ్య భీమా, తాటి శ్రీనివాస్, కందారపు కనకచారి, అంకం రాజు, గాలి ఐలయ్య, భైరి నరేష్, లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మండల ఆయిల్ ఫామ్ సాగు కమిటీ ఎన్నిక

నల్లబెల్లి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:



నల్లబెల్లి మండల ఆయిల్ ఫామ్ సాగు రైతుల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆయిల్ ఫామ్ సాగు వరంగల్ జిల్లా రైతు అసోసియేషన్ అధ్యక్షులు నంద్యాల కృష్ణారెడ్డి, జిల్లా.ఉపాధ్యక్షులు చాడ.కొమరారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచారపు వెంకట్రెడ్డి లు పేర్కొన్నారు, ఈ సందర్భంగా మండల కేంద్రంలో ని రైతు వేదికలో ఏర్పాటుచేసిన నల్లబెల్లి మండల ఆయిల్ ఫామ్ సాగు రైతు సమావేశం ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కమిటీ నల్లబెల్లి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. నల్లబెల్లి మండల అధ్యక్షుడుగా కొండాయలపల్లి గ్రామానికి చెందిన కొలగాని రామారావు, మండల ప్రధాన కార్యదర్శిగా ఇదే గ్రామానికి చెందిన గోనె.వీరస్వామి. మండల కోశాధికారిగా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన నీలా వెంకటేశ్వర్లు గుప్తను. ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఉపాధ్యక్షులుగా అనుముల ముత్తారెడ్డి, పెద్ద కృష్ణారెడ్డి, కార్యదర్శిగా పాల్తియ సారయ్య, కార్యవర్గ సభ్యులుగా చిట్యాల వెంకటరెడ్డి, కదురి మహేందర్రెడ్డి, దొమ్మటి బచ్చయ్య, సింగిరెడ్డి రవి, బోనం శౌరెడ్డి, గాదె కేశవరెడ్డి, జంగిలి శంకరయ్య, బిల్లా కుమారస్వామి, కాటం రాజిరెడ్డి, లను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. మండలంలోని ఆయిల్ ఫామ్ సాగుకు సంబంధించిన ప్రత్యేక సూచనలు ఇవ్వడంతో పాటు. నూతన కమిటీని అభినందించారు. ఉద్యానవన శాఖ సూచనలకు అనుగుణంగా ఆయిల్ ఫామ్ సాగులో మెలకువలు రైతులు తప్పనిసరిగా తెలుసుకోవాలని వారు పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ సాగులో అధిక దిగుబడులు పొంది ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలంటే సంబంధిత ఉద్యానవన శాఖ తోపాటు శాస్త్రవేత్తల సూచనలను తూచా తప్పకుండా పాటించాలని వారు కోరారు.మా నూతన కమిటీకి సహకరించి సహాయ సహకారాలు అందించి సూచించిన జిల్లా కమిటీకి, తోటి రైతులకు నూతన



కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

## భవన నిర్మాణ కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

నర్సంపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త: భవన నిర్మాణ కార్మికుల హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని బిఆర్టీయు వరంగల్ జిల్లా అధ్యక్షులు గోనె యువరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని బిఆర్టీయు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు గత 15 సంవత్సరాలుగా నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక నిర్మాణ కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పి 446 కోట్ల రూపాయలు దారి మళ్ళించారని, ఈ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం కాకుండా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఊడిగం చేసే విధంగా ఉందని మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు వెల్ఫేర్ బోర్డు దారిని అందించాలని ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెప్పకూడదని దారి మళ్లించిన 446 కోట్లను తిరిగి బోర్డులో జమ చేయాలని బోర్డులో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సిబిఐ చేత విచారణ జరిపించాలని కోరారు. రేపు తెలంగాణ భవన్లో జరిగే రాష్ట్ర స్థాయి సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుండి కార్మికుల పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో బిఆర్టీయు రాష్ట్ర కమిటీ సభ్యులు కొల్లూరు లక్ష్మీనారాయణ భవన నిర్మాణ కార్మికులు ఒరిగంటి కుమారస్వామి, కృష్ణ వస్తం, నేరెళ్ల బిక్షం, కుమారస్వామి ఉన్నారు.




## నేడు ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం

నల్లబెల్లి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:



నేడు (బుధవారం )నల్లబెల్లి మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు స్థానిక మండల అభివృద్ధి అధికారి రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చీఫ్ సెక్రటరీ టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశానుసారము, జిల్లా పరిషత్ సీఈవో ఆదేశానుసారము ఈ ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, మిగతా ప్రజా ప్రతినిధులు మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

## విమలక్క పాటల సీడీ ఆవిష్కరణ

నర్సంపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:



అరుణోదయ విమలక్క యాభై ఏండ్ల ప్రస్థానం సందర్భంగా నర్సంపేటకు చెందిన గాయకుడు నెల్లుట్ల సుమన్ రచించిన పాటల సీడీని హైదరాబాద్లో ఆవిష్కరించారు. హైదరాబాద్లోని ఆర్టీసి కళ్యాణ మండపం బావిలింగంపల్లిలో నిర్వహించిన విమలక్క యాభై యేండ్ల అరుణోదయ పాటల ప్రస్థానంలో భాగంగా నెల్లుట్ల సుమన్ విమలక్కపై అద్భుతమైన పాటను రచించాడు. ఈ పాటల సీడీని ప్రొ.హరగోపాల్ ఆవిష్కరించగా ఈ కార్యక్రమంలో విమలక్క దూదాం సృష్టికర్త అంతడుపుల నాగరాజు, రచయిత బుర్ర సతీష్, పిండి శివప్రసాద్ పాల్గొని నెల్లుట్ల సుమన్ను అభినందించారు.

## బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తు ఆహ్వానం

**నర్సంపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** నర్సంపేట మున్సిపల్ పరిధిలో రిటైల్ రెస్టారెంట్, బార్ సంస్థలను ఏర్పాటు చేసి నిర్వహించేందుకు ఫారమ్ 2బి లైసెన్సుల జారీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వ్యక్తులు, వ్యాపార సంస్థలు 100000 రూపాయలు డీడీ/చలాన్ కట్టి దరఖాస్తు ప్రక్రియలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సెప్టెంబర్ 28, 2026 నుంచి అక్టోబర్ 12, 2026 వరకు పని దినాల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు వరంగల్ లోని డీపీఈవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. లైసెన్సుల ఎంపికకు సంబంధించిన లాటరీ డ్రా అక్టోబర్ 16, 2026న నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## నర్సంపేటలో ఘనంగా సృజనాత్మక పోటీలు

నర్సంపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:

దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా, నర్సంపేట పట్టణంలోని మదర్స్ ల్యాండ్ హై స్కూల్ లో విద్యార్థులకు డ్రాయింగ్, స్పీచ్ పోటీలను ఘనంగా నిర్వహించారు.భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో, బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సేవా సంకల్ప్ అభియాన్ వరంగల్ జిల్లా కన్వీనర్ డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు.అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పాశికంటి రమేష్, నియోజకవర్గ నాయకుడు జూలూరు మనీష్ గౌడ్, పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, , మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, సీనియర్ నాయకులు వల్లే పర్వతాలు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కొంకిసా విగ్నేష్ గౌడ్, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు విజయ్ సింగ్, నాగేంద్ర బాబు, ముత్యాల శ్రీనివాస్, పొనుగోటి రవీంద్ర చారి,చేను నరేష్, అజీమ్ పాషా,రాజు, కొండ్రా తరుణ్ సాయి,సంగెపు తేజా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## స్టేడియం అభివృద్ధికి రెండున్నర కోట్ల నిధులు కేటాయించాలి

**- మంత్రిని కోరిన ఎమ్మెల్యే దొంతి**

నర్సంపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:



నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని మినీ స్టేడియం అభివృద్ధికి నిధులు కావాలని క్రీడా శాఖ మంత్రి వాకాటి శ్రీహరిని నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి కోరగా స్టేడియం ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్, జిమ్ ఇతర అభివృద్ధి పనులకు రెండున్నర కోట్లు మంజూరి చేయనున్నట్లు మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గంధం నరేందర్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, బ్లాక్ ప్రెసిడెంట్ చింతల సాంబ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల సారంగం గౌడ్, పట్టణ కమిటీ సభ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మండల నాయకులు ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎండిని కలిసిన ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:



ఆర్టిసి ఎండి మల్లారెడ్డిని హైదరాబాదులోని వారి చాంబర్లో కలిసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి నర్సంపేట నెక్కొండ ఆర్టీసీ డిపోలను అభివృద్ధి చేయాలని పునర్నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. తక్షణమే స్పందించిన ఎండి మల్లారెడ్డి ఐదు కోట్ల రూపాయలతో నిర్మాణం పనులకు మంజూరు ఇప్పిస్తామని అతి త్వరలో డిపిఆర్ చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సంపేట పట్టణానికి వరంగల్ నుండి నాలుగు లైన్ల రోడ్డు వస్తుందని నర్సంపేట నుండి పాకాల వరకు అది కొనసాగుతుందని గత 50 సంవత్సరాల క్రితం నిర్మించిన బస్టాండ్ ను పునర్నిర్మాణం చేయడంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలియజేశారు. అందుకు ఆర్టీసీ ఎండీ తక్షణమే మంజూరు చేయించి నిర్మాణం చేపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గంధం నరేందర్, మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ డిసిసి వైస్ ప్రెసిడెంట్ వేముల సాంబయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చింతల సాంబరెడ్డి, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల సారంగం గౌడ్, పట్టణ కమిటీ సభ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్, మండల నాయకులు ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన

దుగ్గొండి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:

మహిళలు సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని స్థానిక ఎస్ఐ రావుల రణధీర్రెడ్డి అన్నారు. మండల కేంద్రం అంగన్వాడి కేంద్రంలో టీచర్లకు సైబర్ క్రైమ్ నేరాలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎలుగొండ రామస్వామి, సూపర్వైజర్ జయరాణి, అంగన్వాడి టీచర్లు శ్రీదేవి, సరళ, ఉమ, భాగ్యలక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన

**- దసరాలోపు కీలక హామీల అమలుకు చర్యలు తీసుకుంటాం**

**- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 35 శాతం లాభాల వాటా నుంచి సొంతింటి పథకం వరకు 12 అంశాలపై చర్చ**

భూపాలపల్లి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :

సింగరేణి కార్మికుల సమస్యలు, ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీల అమలు, సంస్థ భవిష్యత్ అభివృద్ధి తదితర అంశాలపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సోమవారం రాత్రి వరకు ప్రగతి భవన్లో సమీక్ష సమావేశం జరిగింది. కార్మికుల సమస్యలపై ఐఎన్టీయూసీ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తులపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, దసరాలోపు పలు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామితో పాటు కోల్బెల్ట్ ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్, ప్రేమ్ సాగర్ రావు, గండ్ర సత్యనారాయణ రావు, గడ్డం వినోద్, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, కోరెం కనకయ్య, రామదాసు, సాంబశివరావులతో పాటు ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డా. జనక్ ప్రసాద్ పాల్గొన్నారు. సింగరేణి యాజమాన్యం తరఫున సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ పా. గౌతమ్ పోట్రు, డైరెక్టర్లు కొప్పుల వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, తిరుమల రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ నాయకులు సింగరేణి కార్మికులకు సంబంధించిన పలు కీలక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయడంతో పాటు కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, వైద్య సేవలు, సంస్థ ఆర్థిక పరిపుష్టికి సంబంధించిన అంశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా 202526 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ ఆర్జించిన లాభాల్లో కార్మికులకు 35 శాతం లాభాల వాటాను ప్రకటించి, దసరా పండుగలోపు వారి ఖాతాల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రతి నెలా మెడికల్ బోర్డులను నిర్వహించాలని కోరారు. సాధ్యమైనంత వరకు కార్మికులను మెడికల్ అన్ఫిట్ చేయకుండా చూడడంతో పాటు గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డుల నిర్ణయాలను పునఃసమీక్షి ంచి సంబంధిత కార్మికులకు మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ముఖ్య హామీల్లో ఒకటైన కార్మికుల సొంత ఇంటి పథకాన్ని సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని కోరారు.అదేవిధంగా కోల్ ఇండియా తరహాలో సింగరేణి కార్మికులకు సంబంధించిన పెర్క్స్ ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించే అంశంపై దసరాలోపు నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలియాస్ నేమ్స్ సమస్యపై ఇప్పటికే కమిటీ సమావేశం జరిగినందున, ఈ సమస్యను వన్టైమ్ సెటిల్మెంట్ ద్వారా మానవీయ కోణంలో పరిష్కరించాలని ఐఎన్టీయూసీ ప్రతినిధులు కోరారు. అలాగే పెండింగ్లో ఉన్న కోర్టు, విజిలెన్స్ కేసులను సమీక్షి ంచి సాధ్యమైన మేరకు మానవీయ కోణంలో పరిష్కరించాలని, డిస్మిస్ అయిన కార్మికులకు కూడా నిబంధనల మేరకు మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి



సంస్థ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త బొగ్గు గనులను సంస్థకు కేటాయించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో టీఎస్ జెన్కో, ట్రాన్స్కో నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బొగ్గు ఉత్పత్తితో పాటు సింగరేణి ఆధ్వర్యంలో ఇతర అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసి సంస్థ ఆదాయాన్ని, ఉపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ గనుల్లో డ్రిల్ బిట్స్, భద్రతా సామగ్రి, డంపర్ల స్పేర్ పార్ట్స్ తదితర అవసరమైన పరికరాల కొరతతో యంత్రాల వినియోగం సక్రమంగా జరగడం లేదని నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అవసరమైన సామగ్రిని వెంటనే సమకూర్చి ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని కోరారు. సింగరేణి ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను కూడా సమావేశంలో ప్రస్తావించారు. ఇప్పటికే ఎంపికైన 33 మంది నూతన వైద్యులను వెంటనే విధుల్లోకి తీసుకునికార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి అధికారులకు సంబంధించిన పీఆర్పీ (పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే)ను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు సింగరేణి సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం, యాజమాన్యం సమన్వయంతో పనిచేయాలని ఐఎన్టీయూసీ నాయకులు కోరారు. కార్మికులకు ఇచ్చిన హామీలను నిర్ణీత కాలపరిమితిలో అమలు చేయడం ద్వారా కార్మికుల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐఎన్టీయూసీ ప్రతినిధుల విజ్ఞప్తులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందిస్తూ, దసరాలోపు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ఆయన పేర్కొన్నట్లు ఐఎన్టీయూసీ వర్గాలు తెలిపాయి. అనంతరం ఐఎన్టీయూసీ ప్రతినిధుల బృందం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపింది. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇదే విధమైన సహకారం కొనసాగించాలని కోరింది. ఈ సమావేశంలో ఐఎన్టీయూసీ నాయకులు నరసింహ రెడ్డి, ధర్మపురి, సమ్మయ్య, త్యాగరాజన్, శంకర్ రావు, వికాస్ కుమార్ యాదవ్, శేషా రత్నం, ఆల్బర్ట్, వడ్డేపల్లి దాస్, అక్రం, సత్యనారాయణ రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అక్బర్ అలీ, ప్రొరామియే తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ వార్త

భూపాలపల్లి, కాటారం, ఏటూర్నాగారం, ములుగు

## కేటీకే ఓసీ3లో కార్మికుల భద్రతా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**- టీబీజీకేఎస్ నాయకుల డిమాండ్**

భూపాలపల్లి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :

కేటీకే ఓసీ3 గనిలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న భద్రతా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని టీబీజీకేఎస్ నాయకులు తీవ్రంగా డిమాండ్ చేశారు. మంగళవారం రోజున గని సేఫ్టీ ఆఫీసర్ విక్రమ్ను టీబీజీకేఎస్ ఓసీ3 ఫిట్ సెక్రటరీ ఎస్. మురళీకృష్ణ, షిఫ్ట్ ఇన్చార్జ్ వేమనూరి భాస్కర్, నాయకులు ఎస్. సంపత్, ఎం. తిరుపతి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్మికుల రక్షణకు సంబంధించిన పలు ప్రధాన సమస్యలపై వారు సేఫ్టీ ఆఫీసర్కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. గనిలో ప్రాణాలకు తెగించి పనిచేసే కార్మికులకు అత్యంత అవసరమైన సేఫ్టీ బూట్లు, హెల్మెట్లు, రేడియం జాకెట్లను ఎటువంటి ఆలస్యం చేయకుండా వెంటనే పంపిణీ చేయాలని కోరారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న క్యాప్ ల్యాంపులు సరిగ్గా వెలగకపోవడంతో చీకటిలో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు నాణ్యమైన క్యాప్ ల్యాంపులను తక్షణమే అందించాలని విజ్ఞప్తి చేశారు.రానున్న చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని రాత్రి షిఫ్ట్ కార్మికులకు రక్షణగా గరం కోట్లు అందజేయాలని, అలాగే చాలా కాలంగా పెండింగ్లో ఉన్న యూనిఫామ్లను వెంటనే పంపిణీ చేయాలని సేఫ్టీ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లారు. పంపుల వద్ద పనిచేసే కార్మికులు వాటిని అమర్చడం, తొలగించడం వంటి కష్టమైన పనుల్లో సరైన షింగులు, డీలింగ్స్ , ఇతర అవసరమైన పనిముట్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని వివరించారు.కార్మికులు ఎటువంటి ప్రమాదాల బారిన పడకుండా సురక్షి తంగా విధులు నిర్వహించడానికి అవసరమైన అన్ని రకాల రక్షణ పరికరాలు, నాణ్యమైన పనిముట్లను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని, లేనిపక్షంలో పోరాటాలు తప్పవని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.

## నాగుర్లపల్లిలో రూరల్ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేయాలి

నర్సంపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

నర్సంపేట మున్సిపాలిటీ 16వ వార్డు పరిధిలోని నాగుర్లపల్లి గ్రామంలో రూరల్ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ 16వ వార్డు కౌన్సిలర్ బానోతు నవీన్ నాయక్ జిల్లా కలెక్టర్కి వినతిపత్రం సమర్పించారు.నాగుర్లపల్లి ప్రాంతం చుట్టుపక్కల ఉన్న అనేక గ్రామాలు, తండాలకు కేంద్రంగా ఉందని కౌన్సిలర్ తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రాంత ప్రజలు బ్యాంకింగ్ అవసరాల కోసం నర్సంపేట పట్టణానికి వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులు, వృద్ధులు, మహిళలు, గిరిజనులు, కూలీలు తదితరులు బ్యాంకింగ్ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.నాగుర్లపల్లిలో రూరల్ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని, రైతులు, గ్రామీణ ప్రజలకు రుణాలు, పొదుపు, ఇతర ఆర్థిక సేవలు సులభతరం అవుతాయని కౌన్సిలర్ పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించి, నాగుర్లపల్లిలో రూరల్ బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్కి సిఫారసు చేసినట్లు కౌన్సిలర్ బానోతు నవీన్ నాయక్ తెలిపారు.




## బీజేపీ మండల నాయకుల ముందస్తు అరెస్ట్

గణపురం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:

హిందూ దేవతలపై ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ గణపురం మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి సిద్ధమవుతున్న బీజేపీ మండల కన్వీనర్ మంద మహేష్ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మంద మహేష్ మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలిపేందుకు సిద్ధమైన తమను ముందస్తుగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య హక్కులను అడ్డుకోవడమేనని అన్నారు. అరెస్టులతో తమ ప్రశ్నించే గొంతును అణచలేరని పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో బీజేపీ సీనియర్ నాయకుడు సోమ దామోదర్, మండల



నాయకులు వడ్లం రాజశేఖర్, వేముల రమేష్, చిత్తలూరి కార్తీక్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## అడవిముత్తారం పోలీస్ స్టేషన్ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**- కేసుల పురోగతి, రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసిన ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

మహాముత్తారం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:



వార్షిక తనిఖీల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మంగళవారం అడవిముత్తారం పోలీస్ స్టేషన్ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్లోని పలు రికార్డులను, రిజిస్టర్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసుల వివరాలను, వాటి ప్రస్తుత పురోగతిని అధికారులతో సమీక్షి ంచారు. స్టేషన్ సిబ్బంది పనితీరును పరిశీలించిన ఎస్పీ, బాధితులకు త్వరితగతిన



న్యాయం అందించేలా విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు, సిబ్బందికి తగు సలహాలు, మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ ఎ. సూర్యనారాయణ రావు, కాటారం సీఐ నాగార్జున రావు, స్థానిక ఎస్ఐ జి. రమేష్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## 36వ వార్డులో పారిశుద్ధ్య పనులు శూన్యం

-వార్డులో పేరుకపోయిన చెత్తచెదారం

-జాడలేని బ్లీచింగ్ ఫౌడర్

-శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యధోరణి

మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:

మహబూబాబాద్ మున్సిపాలిటి పరిధిలోని ప్రధాన రహదారికి ప్రక్కనే ఉన్న 36వ వార్డులో పారిశుద్ధ్య పనులు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపుల చెత్తచెదారం పేరుకపోయి సైడ్ డ్రైనేజీలో చెత్త పేరుకపోయి మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలకు నిలయంగా మారి పలువురు అనారోగ్యం పాలవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి సైడ్ డ్రైనేజి చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి డ్రైనేజిలో మట్టి పేరుకపోవడంతో నీరు ఎటు వెళ్లక పోవడంతో నీరు రోడ్లపైకి వస్తున్నాయని తద్వారా ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలం పూర్తి అవుతున్నా ఇప్పటి వరకు పట్టణంలో ఎక్కడ కూడా బ్లీచింగ్ ఫౌడర్ చల్లిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. 36వ వార్డులో పారిశుద్ధ్యంపై సంబందిత శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌కు నెల రోజులుగా ప్రజలు విన్నవించుకుంటున్నా కనీస స్పందన లేకపోవడం అతని నిర్లక్ష్యానికి



నిదర్శనం. ప్రజలందరం నల్లాపన్ను, ఇంటి పన్నులకు మాత్రం సకాలంలో వచ్చి పనులు వసూలు చేస్తున్నారని పారిశుధ్యం విషయానికి వస్తే కనీసం శానిటేషన్ చేసిన దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలో ప్రధాన వీదుల్లో మాత్రమే శుభ్రం చేయిస్తూ ప్రక్కనే ఉన్న గల్లి రోడ్లు పట్టించుకోకపోవడంతో అక్కడ చెత్తచెదారం, ప్లాస్టిక్ కవర్లు డ్రైనేజీలో పేరుకపోవడం, పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నాయని పలువురు మండిపడుతున్నారు. తక్షణమే సంబందిత మున్సిపల్ అధికారులు స్పందించి 36వ వార్డుతో పాటు పలు వార్డుల్లో పారిశుధ్యపనులు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.




## ఉగ్గంపల్లి పీహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు



చిన్నగూడూరు, సెప్టెంబర్29, ప్రభాతవార్త:

వైద్య సేవలు మందుల నిల్వలు సీజనల్ వ్యాధుల నియంత్రణపై చిన్న గూడూరు మండలం ఉగ్గంపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రజా ఆరోగ్య వైద్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు మందుల నిల్వలు లేబరేటరీ సేవలు రోగుల వివరాల నమోదును పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అమలు అవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించి మహబూబాబాద్ జిల్లా రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉండే విధంగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్‌కు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉగ్గంపల్లి ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, మరిపెడ వైద్యాధికారి రవి, వైద్యాధికారులు తదితరులు ఉన్నారు.

## మసీదు నూతన కమిటీ ఏర్పాటు చేయాలి

-పదవీకాలం పూర్తి అయిన పదవిలో కొనసాగుతున్న మాజీ అధ్యక్షుడు



మహబూబాబాద్ టౌన్, సెప్టెంబర్29, ప్రభాతవార్త:

మహబూబాబాద్ పట్టణంలోని తహశీల్దారు కార్యాలయం సమీపంలోని జామ మస్జిద్ ఏ మహబూబియా మర్కజ మస్జిదు కమిటీని ఏర్పాటు చేయడంలో వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ విఫలమైయ్యారని వెంటనే నూతన కమిటీని ఏర్పాటు చేయాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఏ అజీమ్ కోరారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధనపు కలెక్టర్ అనిల్‌కుమార్‌కు సంబందిత వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అజీమ్ మాట్లాడుతూ అనధికారికంగా మస్జిద్ కమిటీ అధ్యక్షునిగా చలామణి అవుతున్న మాజీ అధ్యక్షుడు మస్జిద్ కిరాయిదారులపై దౌర్జన్యం చేస్తున్నారని అతనిపై, అతనికి సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మసీదు కమిటీ గడువు పూర్తి అయిన తర్వాత కూడా ఇష్టానుసారంగా మాజీ అధ్యక్షుడు కమిటీలో ఏదో ఒక బాధ్యతతో చలామణి అవుతూ కిరాయిదారులను ఇబ్బంది పెడుతూ వక్ఫ్ బోర్డు ఆదేశాలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా కిరాయిలను పెంచుతూ కిరాయిదారులను ఇబ్బందికి గురిచేస్తున్న మాజీ అధ్యక్షునిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జెసి అనిల్ కుమార్ వెంటనే స్పందిస్తూ నూతన కమిటీ ఏర్పడే వరకు ఎటువంటి కిరాయిలు ఇతరులకు ఇవ్వకుండా చూడాలని అవసరమైతే కిరాయిదారుల కిరాయిను స్వయంగా వక్ఫ్ బోర్డుకి కట్టించుకోవాలని చెప్పారని అన్నారు. వెంటనే నూతన కమిటీ ఏర్పాటు చేసి మసీద్ అభివృద్ధికి తోడ్పడాలని జెసి అనిల్ కుమార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అహ్మద్, కిరాయిదారులు నాగయ్య, యాకుబ్‌పాషా, అఫ్రోజ్, రఫీ ఉన్నారు.

## పట్టుదలతో ఎంచుకున్న ఉన్నత లక్ష్యాలను సాధించుకోవాలి




-ప్రభుత్వ వైద్యాధికారి యాస హన్మంతరావు

గార్ల, సెప్టెంబర్29, ప్రభాతవార్త:

కష్టపడి చదువును ఇష్టంగా చేసుకొని క్రమశిక్షణ, చక్కటి ప్రణాళిక ప్రకారం పట్టుదలతో ఎంచుకున్న ఉన్నత లక్ష్యాలను నెరవేర్చుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి యాస హన్మంతరావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఐవి రాజకుమారి అధ్యక్షతన నిర్వహించిన డ్రగ్స్ మాదకద్రవ్యాల పట్ల విద్యార్థుల ప్రభావం అవగాహన కార్యక్రమం ఆయన పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితుల్ని, సమాజంలో తల్లిదండ్రుల గౌరవాలను దృష్టి లో ఉంచుకొని మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. డ్రగ్స్ మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలు, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను, నమ్మకాలను అడియాసలు చేయకుండా సక్రమమైన మార్గంలో పయనిస్తు సమాజం గర్వించేటట్లు ఎదగాలని సూచించారు. మంచి ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులున్నారు.

## 5 వ షెడ్యూల్డ్ పరిరక్షణకై ఉద్యమిద్దాం..

అక్టోబర్ 5న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేద్దాం

ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ

1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలి

ఏజెన్సీ ప్రాంతంలో 100!! ఉద్యోగాలు ఆదివాసులకే ఇవ్వాలి

జీవో నెంబర్ 3 ను పునరుద్ధరించి చట్టం చేయాలి

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతర వలసలు నిరోధించాలి

ఏజెన్సీ ప్రాంతంలో పిసా గ్రామ సభలు ద్వారా మాత్రమే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి

ఏజెన్సీలో 1970 తర్వాత గిరిజనేతలకు చేసిన అక్రమ పట్టాలు రద్దు చేయాలి

వెంకటాపురం, ప్రభాతవార్త

ఆదివాసీల హక్కుల పరిరక్షణకై ఆదివాసీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకులపై ఉద్యమించాలని ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటి నాయకులు తుడుం దెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు యాసం రాజు, ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కోర్స నరసింహమూర్తి, గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి, ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షులు పర్శిక సతీష్, ఆదివాసి మహిళ విభాగం అధ్యక్షురాలు జెజ్జరి నారాయణమ్మ పిలుపునిచ్చారు. ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం రోడ్లు భవనాల విశ్రాంతి భవనం నందు ఏర్పాటు చేసుకొని మాట్లాడారు. ఈ సమావేశానికి గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం. సాయి అధ్యక్షత వహించారు. ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ పూనెం శ్రీనివాస్ ఆధ్వర్యంలో తలపెట్టిన భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ముట్టడికి వేలాదిగా ఆదివాసులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆదివాసి ప్రజానీకానికి తెలియజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్ట విరుద్ధంగా ఏజెన్సీ లోకి వలస వచ్చి ఏజెన్సీ ప్రాంత వనరులను అక్రమంగా దోచుకుంటున్నారని ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఏజెన్సీ లోకి గిరిజనేతర వలసలు నిరోధించాలని చట్టంలో స్పష్టంగా పేర్కొనబడి ఉన్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పాలకులు ఆదివాసి చట్టాలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 1970 తర్వాత గిరిజనేతరులకు చేసిన అక్రమ పట్టాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజనేతర ఓట్ల రాజకీయాల కోసం ఆదివాసుల చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ప్రశ్నించారు. స్వతంత్రం వచ్చి 80 ఏళ్లకు చేరువ అయిన ఆదివాసులకు అభివృద్ధి మాత్రం శూన్యమే అని అన్నారు. గిరిజన ప్రాంత నిధులతో వెంకటాపురం మండల కేంద్రంలో గిరిజనేతరుల ఇండ్ల చుట్టూ విశాలవంతమైన రోడ్లు వేస్తూ గిరిజనులు ఉండే గ్రామాలలో నేటికీ దయనీయమైన రోడ్ల పరిస్థితి ఉందని ఆగ్రహించారు. 1/70 చట్టం పటిష్ట అమలు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాలు ముట్టడి ఉంటుందని ప్రభుత్వానికి తెలియజేశారు. ఆదివాసి చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసి చట్టాల ప్రటిష్ట అమలు కోసం మరో శ్రీకాకుళ ఉద్యమానికి ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉంటుందని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి ఆదివాసి ప్రజలు మేధావులు ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్, ఆదివాసి నవనిర్మాణ సేన జిల్లా కన్వీనర్ కుంజ మహేష్, తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి కుచ్చింటి చిరంజీవి, కణితి వెంకటకృష్ణ తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు, కణితి విజయ్ ఆదివాసి నవ నిర్మాణ సేన ములుగు జిల్లా ఉపాధ్యక్షులు, వాసం నారాయణ వెంకటాపురం మండల అధ్యక్షులు, ఆదివాసి సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల అధ్యక్షుడు తుర్సా కృష్ణ బాబు, ఆదివాసి నవనిర్మాణ సేన మండల ఉపాధ్యక్షులు కణితి శంకర్, ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల ఉపాధ్యక్షులు తాటి రాంబాబు, తుర్సా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.





## కూలీలు వలసలు నివారించాలి

**దుగ్గొండి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** గ్రామాల్లో ప్రజలు వలసలు



నివారించి ఉపాధిహామి పథకంలో కూలీలుగా పనులు చేయాలని ఎంపిడివో లెక్కల అరుందతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్‌లకు, ఉపాధికూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్నీలో ప్రభావం వల్ల గ్రామాల్లో కూలీలను అధిక సంఖ్యలో పెంచి ఉపాధి హామీలో కూలీలుగా పనులు చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీ ఉపాధిహామీలో కూలీలుగా పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపివో చంద్రమోహన్, ఏపీవో శ్రీనివాస్, ఈసీ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు బాలునాయక్, సుమలత, శారద, రమేష్, పంచాయతీ కార్యదర్శులు వేణు ప్రసాద్, కొండాయిల్‌రెడ్డి, శశిదర్, వైనాల రాజు, ఎస్‌కే.యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు

**నల్లబెల్లి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** కష్టపడి చదివితే ఉన్నత



శిఖరాలను అధిరోహించవచ్చునని నల్లబెల్లి గ్రామ సర్పంచ్ నాగలి జ్యోతి అన్నారు. మంగళవారం నల్లబెల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 9వ తరగతిలో ప్రథమ ద్వితీయ మార్పులు సాధించిన విద్యార్థినులకు తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం సభాధ్యక్షులుగా కేజీబీవీ ప్రత్యేక అధికారిని ఆవుల సునీత అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్య వేర్లు ఎంత చేదుగా ఉంటాయో దాని పళ్ళు అంత మధురంగా ఉంటాయని, ఇష్టముతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నత పదవుల్లో అలంకరించబడాలని తద్వారా సమాజంలో ఒక ప్రత్యేకమైనటువంటి విలువలతో కూడినటువంటి జీవితాన్ని గడపాలని కన్న తల్లిదండ్రులకు గురువులకు పాఠశాలకు కన్న ఊరుకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ప్రతి విద్యార్థి ఒక లక్ష్యన్ని ఎంచుకొని దాన్ని సాధించుటకు నిరంతరం శ్రమించాలని కన్న తల్లిదండ్రులకు బుక్కెడు అన్నం పెట్టాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రంగాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పున్నం యాకుబ్ రెడ్డి, రంగాపురం మాజీ గ్రామ సర్పంచ్ చీకటి ప్రకాష్, తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి సామాజిక ఉద్యమ నేత కార్యక్రమ నిర్వాహకులు బట్టు సాంబయ్య, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ నల్లా నీరే లక్ష్యం

– మిషన్ భగీరథ ఏఈ ప్రభావతి

***చెన్నారావుపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:*** ప్రతి ఇంటికీ నల్లా ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించడమే మిషన్ భగీరథ లక్ష్యమని ఏఈ ప్రభావతి అన్నారు. మంగళవారం పాత మగ్దూంపురం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని తాగునీటి సరఫరా, నిర్వహణపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి నీరు సక్రమంగా అందేలా గ్రామస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. మిషన్ భగీరథకు సంబంధించిన 8 రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని, నీటి సరఫరా, నిర్వహణ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. రిజిస్టర్ల నిర్వహణతో నీటి సరఫరాలో తలెత్తే సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కరించవచ్చన్నారు. గ్రామంలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ననుమాస కరుణాకర్, ఉప సర్పంచ్ అలవాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రావణకుమారి, వార్డు సభ్యులు కొయ్యల స్వప్న, నాంపల్లి సంపత్, కట్టూరి లక్ష్మణాచారి, ధోనికెల రాజమత, జన్ను రమేష్, పఠాన్ హసీనా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాముడిని శివుడిని వేరు చేసి మాట్లాడడం సబబు కాదు

- భాజపా రాష్ట్ర ధార్మిక కన్వీనర్ అన్నావజ్జుల సూర్యప్రకాష్

నర్సింహులపేట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శివుడుని, రాముడుని వేరు చేసి మాట్లాడడం సరి కాదని భాజపా ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ అన్నావజ్జుల సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తాను శివుడిని ఆరాధిస్తానని,భాజపా రాముడుని ఆరాధిస్తుందని రేవంత్ రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందని తీవ్రంగా విమర్శించారు.రాష్ట్రంలో దక్షి ణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ దక్షి ణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం హరిహర క్షేత్రాలు రాష్ట్రంలో ఉన్నాయన్నా విషయం సీఎం గుర్తు పెట్టుకోవాలని రాజకీయాల్లోకి దేవుళ్లను తీసుకురావద్దని ఆయన హెచ్చరించారు.

## పీఎంజుగాతో తండాలో చీకటిని తరిమేస్తాం

- బిజెపి జిల్లా ప్రధాన్ కార్యదర్శి, గుగులోత్ మదన్ లాల్

నెల్లికుదురు సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:



ప్రధానమంత్రి జుగా పథకం ద్వారా గ్రామంలో అతి కొద్ది కాలంలోనే చీకటి అనేది లేకుండా తరిమేస్తామని భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ మదన్ లాల్ అన్నారు మంగళవారం ఆయన మాట్లాడుతూ రత్తిరామ్ తండా గ్రామంలో తండా ప్రజలు అనేక ఏళ్లుగా చాలీ చాలని వెలుతురులతో చీకటిలో మగ్గుతున్నారని వారి సమస్యలకు ముగింపు పలికే విధంగా పీఎంజుగా పథకం ద్వారా ఒకేసారి 150 విద్యుత్ స్తంభాలను మంజూరు చేపించి తీసుకురావడం జరిగిందన్నారు అదేవిధంగా గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ సహకారంతో తన సొంత గ్రామం తో పాటు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషిని చేస్తానని తెలిపారు.

## నేటితో ముగియనున్న నూతన పెన్షన్ లబ్ధిదారుల పరిశీలన

- ఎంపీడీవో, సింగారపు కుమార్

నెల్లికుదురు సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :



నూతన పెన్షన్ల మంజూరి కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల క్షేత్రస్థాయి పరిశీలన నేటితో ముగుస్తుందని మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ సింగారపు కుమార్ తెలిపారు మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నూతన పెన్షన్ల మంజూరు కొరకు మండల వ్యాప్తంగా 31 గ్రామాల్లో 853 దరఖాస్తులు వచ్చాయని అందులో 843 దరఖాస్తులను సంబంధిత పరిశీలన అధికారులు దరఖాస్తుదారుల ఇంటికి స్వయంగా వెళ్లి పరిశీలన చేయడం జరిగిందని అన్నారు మిగిలిన 10 మంది లబ్ధిదారులు అందుబాటులో లేరని తెలిపారు సంబంధిత నివేదిక ను తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధి కారులకు పంపివ్వడం జరుగుతుందన్నారు.




## హామీలు అమలు పరచడంలో ప్రభుత్వం విఫలం

- చిన్నారిని ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

నర్సింహులపేట, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :



గత ఎన్నికల్లో అధికారులకు రావడానికి ఎన్నో హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన అనంతరం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని వంతడపల గ్రామానికి చెందిన మాలోత్ విజయకాంత్ దివ్య ల కుమారుడు అద్విత్,విధూత్ ల పుట్టినరోజు వేడుకలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరపురాని జ్ఞాపకాలను ఆత్మీయుల సమక్షంలో జరుపుకోవడం మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక



సర్పంచ్ బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సేఫ్టీ కిట్ల వినియోగంపై గౌడన్నలకు శిక్షణ

నెల్లికుదురు సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :

తాటి చెట్టు పైనుండి కల్లు తీసే గౌడన్నలకు చెట్టు పై నుండి జారిపడి ప్రమాదం జరగకుండా ఉండేందుకు జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ (బి సి వెల్ఫేర్ ) ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కిట్టు పథకంలో భాగంగా నూతన సేఫ్టీ కిట్ల వినియోగంపై మంగళవారం మండలంలోని బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామంతో పాటు మదనతుర్తి, రాజుల కొత్తపల్లి గ్రామాల కల్లు గీత కార్మికులకు శిక్షణ ఇచ్చారు ఈ సందర్భంగా జిల్లా బీసీ వెల్ఫేర్ శాఖ జూనియర్ అసిస్టెంట్ శివకుమార్, జిల్లా కోఆర్డినేటర్ గౌని వెంకన్న మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం గౌడన్నలు కుటుంబ పోషణ కోసం కల్లు తీస్తున్న క్రమంలో ప్రమాదాలు జరిగి అనేకమంది మృత్యువాత పడుతున్నారని ఇకపై అలాంటి ప్రమాదాలు జరగకూడదని బీసీ వెల్ఫేర్ శాఖ ద్వారా ప్రభుత్వం నూతన సేఫ్టీ కిట్లను వారికి అందించడం జరుగుతుందన్నారు దీని ద్వారా ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని తెలిపారు ఈ కార్యక్రమంలో బోడపట్ల అశోక్, కేజీకేఎస్ మండల కార్యదర్శి, శీలం సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల వెంకన్న, గ్రామ సొసైటీ అధ్యక్షులు పెరుమాండ్ల శంకర్, తాళ్ల వెంకన్న, పెరుమాండ్ల లింగమూర్తి, పెరుమాండ్ల శ్రీనివాస్, తాళ్ల అంజయ్య, పెరుమాండ్ల శ్రీనివాస్, గుర్రం మురళి, పెరుమాండ్ల వెంకన్న, లింగాల రామ్మూర్తి తదితరులు ఉన్నారు.



## అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

చెన్నారావుపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:



మండలంలోని కందిగడ్డతండా గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని సంబంధిత ఐసిడిఎస్ అధికారులు మంగళవారం సందర్శించారు. కందిగడ్డ అంగన్‌వాడి సెంటర్‌కు పట్టింపు కరువు అంటూ వార్త దినపత్రికలో వచ్చిన కథనానికి నర్సంపేట ఐసిడీఎస్ అధికారులు స్పందించారు. ఈ మేరకు సీడీపీవో మధురిమ ఆధ్వర్యంలో కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. అలాగే ఎఎల్ఎంఎస్సీ కమిటీ సభ్యులు తల్లులతో సమావేశమయ్యారు. కేంద్రం నిర్వహణ నెలకొన్న సమస్యలపై చర్చించారు. నేరుగా వారితో మాట్లాడి పలు విషయాలను నమోదు చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో అంగన్‌వాడి కేంద్రం ఉండటం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు గుర్తించారు. కేంద్రాన్ని మరోచోటికి మార్చేలా చూడాలని వారు విన్నవించుకున్నారు. కాగా అంగన్‌వాడి టీచర్లు సమర్థవంతంగా పనిచేస్తూ కేంద్రాలను సక్రమంగా పనిచేసేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్లు పద్మలత, రాధ, అంగన్‌వాడి టీచర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ హార్ట్ డే సందర్భంగా వాక్ ఫర్ హెల్తియర్ హార్ట్ నిర్వహించిన మెడికవర్ హాస్పిటల్

**ప్రభాతవార్త సుబేదారి;** గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించిన వైద్య




నిపుణులు – వాకథాన్, జుంబా కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యంవరంగల్, 29 సెప్టెంబర్, 2026: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ ఆధ్వర్యంలో"వాక్ ఫర్ ఎ హెల్తియర్ హార్ట్" పేరుతో ప్రత్యేక ప్రజా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండె ఆరోగ్య పరిరక్షణ, హృదయ సంబంధ వ్యాధుల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ (దిశిళి) ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ నుంచి భద్రకాళి బండ్ (ట్యాంక్ బండ్) వరకు వరల్డ్ హార్ట్ డే వాకథాన్ నిర్వహించారు. ప్రజలు నిత్య జీవితంలో క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు.కార్యక్రమంలో భాగంగా గుండె ఆరోగ్యంపై నిపుణుల అవగాహన సదస్సుతో పాటు జుంబా డాన్స్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. దీంతో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటూ గుండె జబ్బుల నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి అవగాహన పొందారు.ఈ అవగాహన కార్యక్రమానికి మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ సీనియర్ కార్డియాలజీ నిపుణులు డా. సంతోష్ మోహన్‌లాల్ మోదాని, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్; డా. శ్రవణ్ కుమార్ రాంపెల్లి, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్; డా. షఫీ పాలగిరి, సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, గుండె సంబంధిత హెచ్చరిక సంకేతాలను ముందుగానే గుర్తించడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, ప్రాథమిక సీపీఆర్ విధానాలను నేర్చుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.డా. షఫీ పాలగిరి మాట్లాడుతూ,"గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయాలి. ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి. ఆరోగ్యకరమైన జీవనశైలితోనే గుండె జబ్బులను చాలా వరకు నివారించవచ్చు" అని అన్నారు.



## విద్యుత్ సబ్ స్టేషన్‌లు సందర్శించిన ఎస్ఈ

గూడూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:



మండలంలోని గూడూరు, అయోధ్యపురం, దామరవంచ 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ లను ఎస్ఇ దర్శన్ కుమార్ మంగళవారం సందర్శించారు. సబ్ స్టేషన్ల నిర్వహణ తీరును పరిశీలించి నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించాలని, వ్యవసాయ కనెక్షన్ ల దరఖాస్తుల క్లియరెన్స్ పై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని, లూజ్ లైన్లను సరిచేయాలని ఆదేశించడంతోపాటు సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. వేసవి కార్యాచరణ ప్రణాళికపై సమీక్షి ంచి మట్టేవాడలో కొనసాగుతున్న నూతన సబ్ స్టేషన్ నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బిల్లుల బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్న మండలంలోని దామరవంచ విద్యుత్ సబ్ స్టేషన్ ను ఆయన సందర్శించి సంబంధిత ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఇ గూడూరు, అయోధ్యాపురం సెక్షన్ ల ఎఇ లు ఎం కుమారస్వామి, జె శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ లక్ష్మణ్ ల తో పాటు సిబ్బందికి పలు ఆదేశాలు సూచనలు జారీ చేశారు.

## సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ నాయకులు

**వరకాల సెప్టెంబర్ 29 (ప్రభాతవార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై, హిందూ దేవతలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పరకాల పాత ఎటిఎం సెంటర్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు పిలుపు మేరకునిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా గాజుల నిరంజన్ మాట్లాడుతూ.. దేశ ప్రధానిపై రాజకీయ విమర్శలు చేయడం ఒక విషయం, కానీ కోట్లాది మంది హిందువులు ఆరాధించే శ్రీరాముడు, పరమశివుడి వంటి దేవతలను రాజకీయాలకు ముడిపెట్టి మాట్లాడటం కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని అన్నారు.ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాభిప్రాయాలకు స్థానం ఉందని, అయితే హిందూ దేవతలను రాజకీయ వ్యాఖ్యలకు వేదికగా మార్చడం సమంజసం కాదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడే ప్రతి మాటకు బాధ్యత ఉంటుందని, ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ సంయమనం పాటించాలని డిమాండ్ చేశారు.ప్రధాని మోదీపై విమర్శలు చేసే బీజేపీ రాజకీయంగా సమాధానం చెబుతున్నాం,కానీ హిందూ దేవతలను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తే హిందూ సమాజం మౌనంగా ఉండదని గాజుల నిరంజన్ స్పష్టం చేశారు.హిందూ సమాజ మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఈ విషయంలో ముఖ్యమంత్రి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కుక్కల విజయ్ కుమార్,ఆకుల లావణ్య శ్రీధర్, జిల్లా కోశాధికారి ఎర్ర రామన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి సంగా పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి,మాజీ అధ్యక్షులు మార్త బిక్షపతి, కానుగుల గోపీనాథ్, కార్యదర్శి దార్నసునీల్ కుమార్,ఆకుల రాంబాబు ఓబీసీ మండల అధ్యక్షుడు పైండ్ల రంజిత్ కుమార్,బీజేవైఎం నాయకులు కక్కురాజు, కొలనుపాక రేవంత్ సిద్దు, బూత్ అధ్యక్షులు పిట్ట కిషోర్, దామ సతీష్, కాగితపు చంద్రమోహన్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.



# గూడూరు వార్త

గూడూరు, కొత్తగూడ, గంగారం, కేసముద్రం

## గూడూరులో బిజెపి ఆందోళన

గూడూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:



హిందూ దేవుళ్లపై తెలంగాణ సీఎం అనుచిత వ్యాఖ్యలు చేశాడని ఆరోపిస్తూ బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గూడూరులో ఆందోళన చేపట్టారు. ఈ మేరకు పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు బస్టాండ్ సెంటర్ లో కాంగ్రెస్ పార్టీ, సీఎం వ్యతిరేక నినాదాలు చేస్తూ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు బిజెపి శ్రేణులు విఫలయత్నం చేశారు. ఆందోళన చేస్తున్న స్థలం వద్దకు దిష్టిబొమ్మను తెచ్చి దగ్ధం చేసే ప్రయత్నాన్ని చేయడం గమనించిన పోలీసులు ఆ ప్రక్రియను అడ్డుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ హిందూ దేవుళ్లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను బిజెపి నాయకులు ఈ సందర్భంగా ఖండించారు. హిందూ సమాజం మనోభావాలను గౌరవించాలని, దేవుళ్లపై వ్యాఖ్యలు చేసేటప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు రాసమల్ల వెంకటేశ్వర్లుతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు గుగులోతు రాంబాబు, మేరెడ్డి సురేందర్, చెల్పూరు శ్రీశైలం, వాంకుడోత్ మోతీలాల్, పడాల నాగరాజు, సమ్మెట సుధాకర్, బూర్గు సాయికుమార్, చెల్పూరి రాజు, బానోత్ భాస్కర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సాంఘీక సంక్షేమ గురుకులం పరిశీలన

చెన్నారావుపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:



చెన్నారావుపేట మండల కేంద్రంలో ఉన్న దుగ్గొండి సాంఘీక సంక్షేమ గురుకులాన్ని ఎంపిడివో వెంకట సాయిశివానంద్ మంగళవారం సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపిడివో గురుకులానికి చేరుకొని రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే మరుగుదొడ్లు, స్టోర్‌రూమ్, వసతీ గృహాలు వంటి వాటిని సందర్శించారు. గురుకులం నిర్వహణ తీరు మధ్యాహ్న భోజన నిర్వహణ పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గురుకులాలు సమర్థవంతంగా కొనసాగాలన్నారు. ముఖ్యంగా పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటేనే చదువుల్లో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఎంపిడివో జీడిగడ్డతండాను పరిశీలించి ఇంకుడుగుంతల ఏర్పాటును పరిశీలించారు. గ్రామపంచాయతీకి చేరుకొని రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింహరాములు తదితరులు ఉన్నారు.

## గత పాలకవర్గమే వైకుంఠ రథాన్ని నిర్లక్ష్యం చేసింది

**చెన్నారావుపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** గతంలో ఉన్న గ్రామ పంచాయతీ పాలకవర్గం వైకుంఠ రథాన్ని నిర్లక్ష్యం చేసిందని స్థానిక పాతముగ్దుంపురం గ్రామ సర్పంచ్ ననుమాస కర్ణాకర్‌గౌడ్ అన్నారు. వైకుంఠ రథానికి పుట్టెడు కష్టాలు అంటూ వార్త దినపత్రికలో వెలువడిన కథనానికి గ్రామ సర్పంచ్ స్పందించి ప్రభాతవార్తతో మాట్లాడుతూ గతంలోనే ఈ వాహనానికి మరమ్మత్తులు చేయక వదిలేశారన్నారు. పాడై సుమారు ఐదు సంవత్సరాలు దాటిందన్నారు. అట్టి వాహనాన్ని మరమ్మత్తులు చేసేందుకు నిధుల కొరత ఉందన్నారు. ఇప్పటికే గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామ సభలో చర్చించడం జరిగిందన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ పేర్కొన్నారు. అంతే తప్ప ఇందులో తమ తప్పిదం లేదన్నారు.

# హాస్టల్ లో వసతులు మెరుగ్గా ఉండాలి

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులు అన్నీ సబ్జెక్ట్ ల మీద దృష్టి పెట్టాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

లష్కర్ బజారు లోని అర్బన్ రెసెడెన్షియల్ స్కూల్ ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**సెప్టెంబర్ 29, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :**
హాస్టల్ లో విద్యార్థులకు మెరుగైన వసతులు ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ లష్కర్ బజారు లోని అర్బన్ రెసెడెన్షియల్ స్కూల్ ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో భాగంగా అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలోని కిచెన్ రూమ్ ను పరిశీలించారు. విద్యార్థులకు అందించేందుకు తయారు చేస్తున్న వంట పదార్థాలను తనిఖీ చేశారు. వంట గదిలోని నిత్యావసరాలు, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజు అందించే



మెనూ చార్ట్ ని పరిశీలించారు. అనంతరం 5, 6వ తరగతి విద్యార్థుల దగ్గరికి వెళ్లి...ఈ రోజు పెట్టిన బ్రేక్ ఫాస్ట్ గురించి ఆరా తీశారు. స్నాక్స్, గుడ్లు పెడుతున్నారా అని, అలాగే టీచర్స్ వస్తున్నారా అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టులకు సంబంధించి వివరాలను విద్యార్థులను అడిగి వారి అభ్యసన సామర్థ్యాలను కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయనందుకు... అలాగే క్లాస్ రూమ్ లో ఫ్యాన్ రిపేర్ చేయించనందుకు హాస్టల్ స్పెషల్ ఆఫీసర్ ను కలెక్టర్ మందలించారు. చివరగా విద్యార్థులకు సంబంధించిన టాయిలెట్స్, డార్మెంట్రీ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. ప్రతి పూట నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వంట తయారీలో నాణ్యమైన నిత్యావసర వస్తువులను, తాజా కూరగాయలను వినియోగించాలన్నారు. విద్యార్థులకు అందించే టిఫిన్, స్నాక్స్, లంచ్, డిన్నర్ ఏ సమయం లో పెట్టాల్సిన వాటిని సమయానుకూలంగా పెట్టాలని తెలిపారు. విద్యార్థులకు అందించే భోజన పదార్థాలు నాణ్యతగా, పరిశుభ్ర వాతావరణంలో అందించాలన్నారు. తరగతి గదులు అన్ని కూడా పరిశుభ్రంగా, విద్యార్థులకు అనుకూలమైనవిగా ఉండాలన్నారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో నేర్చుకున్నవి భవిష్యత్ జీవితంలో స్థిరపడడానికి దోహదపడుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బంది కలిగేలా పని చేస్తే చర్యలు తప్పవని స్పెషల్ ఆఫీసర్ దీప ని కలెక్టర్ హెచ్చరించారు.

# వనదేవతల సన్నిధిలో 'ది ప్యారడైజ్' టీమ్..



ఘనంగా మొక్కుల చెల్లింపు!

నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించిన నాని, శ్రీకాంత్ ఓదెల.. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

**ములుగు ప్రభాతవార్త**
సినీ విజయం అనంతరం ప్రముఖ హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మేడారం వనదేవతల సన్నిధికి చేరుకున్నారు. ములుగు జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మేడారం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద 'ది ప్యారడైజ్' చిత్ర బృందం ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంది. సినిమా విజయాన్ని పురస్కరించుకుని వనదేవతలకు కృతజ్ఞతలు తెలిపిన చిత్ర బృందం.. అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించింది.

హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తమ శరీర బరువుకు తూగేలా బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లకు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, చీర సారెలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి, నటుడు సంపూర్ణేష్ బాబు తదితరులు చిత్ర బృందంతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు.

**గట్టమ్మ ఆలయంలోనూ ప్రత్యేక పూజలు**

మేడారం చేరుకునే ముందు ములుగు జిల్లా కేంద్రం సమీపంలోని ప్రసిద్ధ గట్టమ్మ ఆలయాన్ని చిత్ర బృందం సందర్శించింది. గట్టమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మేడారం బయలుదేరారు. 'ది ప్యారడైజ్' చిత్రంలో సమ్మక్క, సారలమ్మ పేర్ల ప్రస్తావనతో పాటు అనిరుధ్ రవిచందర్ సంగీతంలో రూపొందిన 'సమ్మక్కా' పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నేపథ్యంలో చిత్ర బృందం వనదేవతల దర్శనానికి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**పోలీసుల పటిష్ట బందోబస్తు**

ప్రముఖ సినీ నటుడు నాని, చిత్ర బృందం రాక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పసర సీఐ పత్తిపాక దయాకర్ పర్యవేక్షణలో ఎస్సైలు కమలాకర్, మధు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువత నాయకులు మువ్వ భాను ప్రకాష్, అజిత్, మోహన్, వాగా, ములుగు జిల్లా నాయకులు దండగల మల్లయ్య, దిడ్డి మోహన్ రావు, తాటి కృష్ణ, ఏకుల ధనుంజయ, తాటికొండ శ్రీనివాసచారి, లాకావత్ చందూలాల్ తదితరులు పాల్గొన్నారు.

# గుండె వ్యాధులపై ఏకశిలా హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు







**ప్రభాతవార్త సుబేదారి:**
గుండె వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం అప్పయ్య సూచించారు మంగళవారం రోజు వరల్డ్ హెల్త్ హార్టుడే సందర్భంగా అనుమకొండ లోని ఏకశిలా హాస్పిటల్ యాజమాన్యం ఒక ప్రముఖ హోటల్లో ఉచిత వైద్య శిబిరము అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎంహెచ్వో డాక్టర్ ఎం అప్పయ్య జ్యోతి ప్రజ్వలన చేసి గుండెకు సంబంధించిన నొప్పులను నిరక్ష ్యం చేయవద్దని మద్యపానానికి ధూమపానానికి దూరంగా ఉండాలని వ్యాయామం శరీరానికి అవసరమన్నారు ఏకశిలా హాస్పిటల్ ఎండి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా ప్రజలు తమ యొక్క ఆరోగ్యం పై దృష్టి పెట్టి జీవన శైలిని మార్చుకోవాలని తెలియజేశారు ఏకశిలా హాస్పిటల్ లో విజయవంతంగా గుండె శాస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు ఈరోజు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలపై అవగాహన పెంచుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఏకశిలా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సంధ్యారాణి డాక్టర్ ప్రవీణ్ రెడ్డి మెడికల్ డైరెక్టర్ బాల్ కార్డియాలజిస్టులు రామకృష్ణారెడ్డి డాక్టర్ అనిల్ డాక్టర్ చైతన్ కృష్ణ క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ లావణ్య తోపాటు జిల్లాలోని ప్రముఖ కార్డియాక్ వైద్యులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీదేవితో పాటు ఏకశిలా హాస్పిటల్ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు

# విద్యార్థుల విద్యా ప్రగతి పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి..

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో





**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో, ప్రభాతవార్త**
విద్యార్థుల విద్యా ప్రగతి పై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల పురోగతిపై ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి విస్తృత తనిఖీలు చేపట్టారు. గిరిజన విద్యార్థుల విద్యాశాతం పెంపొందించాలని లక్ష ్యంతో తరచూ ఐటిడిఏ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రామంజాపూర్‌లోని ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోపాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. వారి విద్యా ప్రగతి, బోధనా విధానం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల రికార్డులు, అకాడమిక్ ప్రగతికి సంబంధించిన వివరాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన మరియు ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సమస్యలు మరియు అవసరాలపై సిబ్బందితో ప్రాజెక్ట్ అధికారి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, అవసరమైన సౌకర్యాలు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆకస్మిక తనిఖీ సందర్భంగా పాఠశాల సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించాలి

– జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



**జనగామ టౌన్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :**
జనగామ జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతంచేసి సంస్థను బలోపేతం చేసేందుకు నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. నూతనంగా ఎన్నికైన మేనేజింగ్ కమిటీ సభ్యులు సోమవారం రాత్రి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఆఫీస్ బేరర్లను పరిచయం చేసుకున్నారు. మూడోసారి చైర్మన్‌గా ఎన్నికైన డా.డి.లవకుమార్ రెడ్డిని కలెక్టర్ అభినందించి, జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తరించేందుకు కృషిచేయాలని సూచించారు. జనగామ జిల్లారెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీకి 15మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండగా, మొత్తం 17మంది నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి, స్టేషన్‌ఘనపూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.కిరణ్ ప్రకాశ్‌కు సమర్పించారు. ఏకగ్రీవ ఎన్నికకు అనుగుణంగా కన్న పరశురాములు, కృష్ణజీవన్ బజాజ్‌లు పోటీనుంచి ఉపసంహరించుకోవడంతో 15మంది మేనేజింగ్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం ఆఫీస్ బేరర్ల ఎన్నిక నిర్వహించి పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షుడిగా వ్యవహరించే ఈ కార్యవర్గంలో చైర్మన్‌గా డా.డి.లవకుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా ఇ. ప్రభాకర్ రెడ్డి, కోశాధికారిగా గాదె క్యాథరిన్, రాష్ట్ర ఎం.సి.సభ్యునిగా దొంతుల శేఖర్ ఎన్నికయ్యారు. మేనేజింగ్ కమిటీ సభ్యులుగా వేమల్ల నరసింహరెడ్డి, ఎస్.శివరాజ్ యాదవ్, సిహెచ్.సురేందర్ రెడ్డి, డా.పి.సత్యం, బి.రజినీ, జైన రమేశ్, పప్పు వెంకట్‌రెడ్డి, పి.శ్రీనివాస్, పేర్వారం ప్రభాకర్, డా.ఏ.హేమంత్ రాజ్, ఎం.ఆంజనేయులు ఎన్నికయ్యారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతంచేసి, ప్రజలకు అవసరమైన సేవలను సమర్థవంతంగా అందించేందుకు కమిటీ సభ్యులంతా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.